# శాంతి

# SANTI

విశ్వమానవ సాభ్రాతృత్వ సందేశము గల ఆధ్యాత్మిక మాసపత్రిక

January / జనవరి - 2026



**ప్రణవోధనుః శరోహ్యాత్మా బ్రహ్మతల్లక్ష్యముచ్యతే**
**అప్రమత్తేన వేధ్ధవ్యం శరవత్ తన్మయోభవేత్**

ఏకం సత్ విప్రా బహుధా వదంతి

ఒకే సత్యము అనేక విధములుగా బ్రహ్మజ్ఞులచే చెప్పబడినది.

– ఋగ్వేద సంహిత

# శాంతి

# SANTI


**విశ్వమానవ సౌభ్రాతృత్వ శాంతి సందేశ ఆధ్యాత్మిక మాసపత్రిక**

**స్థాపకులు : పరమపూజ్య శ్రీస్వామి ఓంకార్‌జీ మహరాజ్**

**సంపాదకులు : స్వామిని వినమ్రానంద**

VoL./ సంపుటి : **101** January / జనవరి **–2026** No./ సంచిక : **1**


| వ.నెం. | విషయసూచిక | పేజి నెం. |
|---|---|---|

| 1. | ప్రార్థన | 2 |
| 2. | ధ్యానము | 3 |
| 3. | శ్రీ ఓంకార్ ఆత్మకథ – అనువాదం : బొప్పన అరుణాదేవి | 4 |
| 4. | ఆనంద రామాయణం – పరిష్కర్త స్వామి సత్యాత్మానంద | 9 |
| 5. | జన్మదిన సందేశం | 12 |
| 6. | ఏకజీవ వాదము – స్వామి బోధాత్మానంద | 15 |
| 7. | సర్వవేదాంత సిద్ధాంతసారసంగ్రహం<br>భగవత్పాద శ్రీ ఆది శంకరాచార్య విరచితం<br>టీకా–స్వామి బోధాత్మానంద సరస్వతి | 19 |
| 8. | శాంతి ప్రార్థన – వినమ్రానంద సరస్వతి | 23 |
| 9. | విరాళములు | 26 |
| 10. | కార్యక్రమములు | 27 |



**ఈ పత్రికలో ప్రచురింపబడిన వ్యాసముల యొక్క భావాలకు రచయిత్రి / రచయితలే బాధ్యులుకాని, సంపాదకులు కారు.**



జీవిత సభ్యత్వం రూ. **1000/–** లు సాలుసరి రూ. **100/–**




# ప్రార్థన

ప్రభూ! ఈ నూతన సంవత్సరమున యేమని నీకు ప్రార్థన జేయుదును?

ప్రార్థన, నన్ను నీలో విలీనము జేయుచు జీవాత్మ పరమాత్మల ఐక్యసంధానమును గల్గించునట్లు చేయుము.

ఎవరని నిన్ను నిర్ణయించేదిరా? నీవు యెచ్చట యున్నావు నా దైవమా! నీవు దూరముగాయున్న, నీకు వినిపించుటకు బిగ్గరగా ప్రార్థన చేయవలెను, నీవు దగ్గరలోనే ఆంతర్యముననే యున్న, నెమ్మదిగానే, నిశ్శబ్దములోనే ప్రార్థన చేయవలెను.

అంతా రామమయం, ఈ జగమంతా రామమయం గాన, సర్వములో సర్వత్రా సదా నిన్నే గాంచుచు, మా నూతన సంవత్సరమును ప్రారంభించెదముగాక!

నీవు అద్వితీయుడవై, సర్వము నిండి, సర్వజ్ఞతతో వెలసియుంటివిగాన, మా స్వార్థ రహితమైన జీవితమునే గొప్ప ప్రార్థనగ జేయుము.

మొక్కను, పక్షిని, జంతువును, మానవుని ఒకేరీతిగా విశ్వప్రేమతో ప్రేమించెడి వారే నిజమైన ప్రార్థనను జేయుచుండిరి.

ఈ నూతన సంవత్సరమున మానవకోటినంతను, స్వార్థ రహితముగా ప్రేమించుచు, అందరిలో నిన్నే దర్శించుచు, ప్రేమించుచు విశ్వశాంతితో, నిశ్శబ్దముగా, సర్వులలో పూజించుటయే మా నిజమైన, శాశ్వతమైన, స్థిరమైన ఏకైక ప్రార్థనగా సదాయుండనిమ్ము.

**ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః**

# ధ్యానము

**సర్వగ్ం హ్యేతద్బ్రహ్మాయమాత్మా బ్రహ్మ సోఽయమాత్మా**

ఈ సమస్తము నిశ్చయముగా బ్రహ్మ. ఈ ఆత్మ బ్రహ్మ. అట్టి ఈ ఆత్మ నాలుగు పాదములు గలది.

**సర్వం హ్యేతద్బ్రహ్మేతి। సర్వం యద్ ఉక్తమ్ ఓంకారమాత్రమ్ ఇతి తద్ ఏతద్ బ్రహ్మ। తత్ చ బ్రహ్మ పరోక్షాభిహితం ప్రత్యక్షతో విశేషేణ నిర్దిశతి అయమాత్మా బ్రహ్మ ఇతి। అయమ్ ఇతి చతుష్పాత్త్వేన ప్రవిభజ్యమానం ప్రత్యగాత్మతయా అభినయేన నిర్దిశతి అయమాత్మా ఇతి। సః అయం ఆత్మా ఓంకారాభిధేయః పరాపరత్వేన వ్యవస్థితః చతుష్పాత్, కార్షాపణవత్ న గౌః ఇవ ఇతి। త్రయాణాం విశ్వాదీనాం పూర్వపూర్వప్రవిలాపనేన తురీయస్య ప్రతిపత్తిః ఇతి కరణసాధనః పాదశబ్దః। తురీయస్య పద్యతే ఇది కర్మసాధనః పాదశబ్దః ॥2॥**

సర్వమ్–ఇత్యాది. ఏదైతే సమస్తము ఓంకారము మాత్రమేనని పైన చెప్పబడినదో, అది (సమస్తము) అట్టి ఈ బ్రహ్మయే. పరోక్షముగా చెప్పబడిన ఆ బ్రహ్మను శ్రుతి ప్రత్యక్షముగా కూడ విశేషముగా (ఇది అని ప్రత్యక్షానుభవరూపముగా), ఈ ఆత్మ బ్రహ్మయే అంటూ, నిర్దేశిస్తోంది. ఈ ఆత్మ అంటే నాలుగు పాదములు గలదిగా విభాగము చేయబడుచున్న ఆత్మ. శ్రుతి అయమాత్మా అంటూ బ్రహ్మను ఈ జీవుని అంతర్గతమగు సారసత్త్వముగా అభినయముతో నిర్దేశిస్తోంది. ఓంకారముచే నిర్దేశించ బడుతూ పరము (కారణబ్రహ్మ), అపరము (కార్యబ్రహ్మ) గా వ్యవస్థ చేయబడి ఉన్న అట్టి ఈ ఆత్మ నాలుగు పాదములు గలది. రూపాయలో పావలాలు వలె నాలుగు పాదములు గలది. ఆవు పొట్టకు ఉండే నాలుగు కాళ్ళవలె కాదు. విశ్వ–తైజస–ప్రాజ్ఞులు అనే మూడు పాదములయందు ముందు ముందు ఉన్నదానిని ప్రవిలాపము చేయుటచే నాల్గవదియగు బ్రహ్మ లభిస్తుంది. కావున, అక్కడ పాద శబ్దమునకు కరణవ్యుత్పత్తిని చెప్పాలి. నాల్గవదియగు బ్రహ్మ పొందబడుచున్నది గనుక, ఆ సందర్భములో పాదశబ్దమునకు కర్మవ్యుత్పత్తిని చెప్పాలి.

ఈ ప్రపంచమున సమస్త పదార్థములు ఉత్తమ పురుష ప్రయత్నము చేతనే లభించుచున్నవి. ఎవరు ఏ పదార్థమును కోరుదురో దాని కొరకు ప్రయత్నము చేస్తూ మధ్యలో విరమించకుండా వుంటారో వారు క్రమముగా దానిని పొందుతారు. ప్రయత్నవంతులు, దృఢ అభ్యాసనిరతులు, ఉత్సాహవంతులు అగువారికి అదృష్టముతో సంబంధము లేకనే వారి అభిలషిత పదార్థము లభించును. మన గత సంస్కారములు ఎంత చెడ్డవైనను, తీవ్ర పురుష ప్రయత్నం ద్వారా వాటిని శుభ సంస్కారములుగా మార్చుకొనవచ్చును. పురుష ప్రయత్నము చేయకుండా ఎవరు కేవలము అదృష్టాన్ని (దైవాన్ని) నమ్ముకొని వుంటాడో వాడు అధముడే–పిచ్చివాడే. ఈ ప్రపంచమున అనర్థహేతువైనట్టి సోమరితనము అనునది లేనిచో ఎవడు మహా విద్వాంసుడు, గొప్పవాడు కాకుండును. మన ప్రయత్నము విఫలమైతే మరల మరల ప్రయత్నము చేయుట ఒక్కటే మార్గము. మహాత్ములు తమకు సంభవించిన అనేక ఆపదలను తీవ్ర పురుష ప్రయత్నము ద్వారా మాత్రమే దాటగలిగిరి. కాని అదృష్టము వలన కాదు. మనుజుని చిత్తము అశుభమార్గము నుండి, నెమ్మదిగా ప్రయత్నపూర్వకముగా నివారింరపబడినచో అది శుభమార్గమున రెండింతలు వేగముగా పరుగెత్తును. (హఠము పనికిరాదు).

**–సూక్తి ముక్తావళి**



# శాంతి ప్రదాత శ్రీ ఓంకార్ స్వామిజీ ఆత్మకథ

**మూలం : స్వామిఓంకార్** **అనువాదం : బొప్పన అరుణాదేవి**

**(గత సంచిక తరువాయి)** **అధ్యాయం – 67**

## కుమారి జ్ఞానేశ్వరి

ఈ ప్రాపంచికమయిన ఇహానికి సంబంధించిన ప్రపంచము ద్వంద్వముతో కూడి ఉంటుంది. అలాంటి ప్రపంచంలో కనీసము ఒక్కరయినా నిజమయిన ప్రేమ కల్గిన శిష్యులు, తమ పట్ల సంపూర్ణమయిన అవగాహన కల్గి అర్థం చేసుకోగల్గినవారు దొరకటము అదృష్టము. నేను ఎప్పుడూ శిష్యుల కోసము, గురువుల కోసము, మహాత్ముల కోసము పరిగెత్తలేదు. నేను కనిపించే ప్రతి ఒక్కరిలో ఆ పరమాత్మ ప్రతిరూపాన్నే దర్శిస్తాను. అందరిలో ఏకత్వాన్ని బ్రహ్మాన్ని దర్శించటం నాకు అత్యంత ఆనందాన్నిస్తుంది. ఈ ప్రపంచమంతా ఈశ్వరునితో నిండి ఉంది. 'ఈశావాస్యం సర్వమిదం".

కుమారి జ్ఞానేశ్వరి ఎంతో అంకితభావము, ప్రేమ, వినయము, మృదువయిన స్వభావము కలది. ఆమె తన గురించి ఎన్నడూ ఆలోచించదు, కానీ ఎల్లప్పుడూ ఇతరులకు ఏ విధంగా సహాయపడగలనా? అని ఆలోచిస్తుంటుంది. ఆమె బాల్యం నుండి కూడా నా పట్ల అపరిమితమయిన ప్రేమానురాగాలు చూపిస్తూ నన్నే తన సర్వస్వంగా భావించేది. ఆమె నన్ను ఎంతగా ప్రభావితము చేసిందంటే ఆమెను భగవంతుడే స్వయంగా నిర్దేశించి శిష్యురాలిగా పంపించాడు అని నేను భావించే వాడిని. ఆమె పూర్తిగా నిస్వార్థజీవి. ఉదాత్తమయిన మంచి శీలము, విశాల దృక్పథము కలది. అంతేకాదు ఆమె ఎల్లప్పుడు దాతృత్వము కల్గి ఉండేది. చాలా సందర్భాలలో ఆమె నాకు గురువు కంటే ఎక్కువగా భావించేవాడిని. ఆమె నాకు అనుయాయురాలిగా, శిష్యురాలిగా కంటే ఒక ఉపాధ్యాయురాలిలాగా కనిపించేది. ఎందుకంటే ఆమె నిస్వార్థపరత్వము నాకు కూడా అనుసరించ దగినదిగా ఉండేది. ఇప్పుడు నేను ఆమెలోని గొప్ప సుగుణాలను గురించి పొగడడానికి లేను. దాని వలన ఆమెకి గాని నాకు గాని మంచిది కాదు. ఆమెలో ఉన్న మరొక సుగుణం ఏమిటంటే ఎవరయినా పొగిడితే ఆమెకు అస్సలు ఇష్టం ఉండదు.

ఇప్పుడు నేను మీకు నిన్న జరిగిన ఒక హృదయాన్ని కదిలించి వేసే సంఘటన గురించి చెప్పాలనుకుంటున్నాను. దాని వలన మన పాఠకులు వారే నిర్ణయించు కుంటారు. ఆమెలోని గొప్ప ఆత్మస్థైర్యము, అంతేకాక పనిపట్ల ఆమెకు ఉన్న నిబద్ధత, నిస్వార్థము మొదలైన సుగుణాల గురించి నేను చెప్పిన విషయాలు ఎంత యదార్థమో అర్థం చేసుకుంటారు.

ఆ రోజు విపరీతంగా వర్షం కురుస్తోంది. పైగా బాగా చీకటి పడింది. డా॥ సి.కె.ప్రసాద్‌రావు గారు, మద్రాస్ జనరల్ హాస్పిటల్ డీన్ గారు అప్పుడు మా ఆశ్రమంలోనే ఉన్నారు. రాత్రి అయినా, పగలయినా, వేడిగా ఉన్నా చలిగా ఉన్నా, వర్షం పడినా, ఎండ కాచినా, మా జ్ఞానేశ్వరికి ఆమె పని ముఖ్యం. అందువలన అంత కుండపోతగా వర్షం కురుస్తున్నప్పటికీ ఆ చీకటి రాత్రివేళ ఆమె డా॥ ప్రసాదరావు గారి కుటీరానికి భోజనము తీసుకువెళ్ళసాగింది. దారిలో ఆమెను విషపూరితమయిన పాము కరిచింది. అయినా ఆమె లెక్కచేయకుండా భోజనము తీసుకువెళ్ళి, ఆయనకి వడ్డించి, ఆయన భోజనము చేయటం పూర్తి అయ్యేవరకు అక్కడే వేచి ఉండి, పూర్తి అయిన తర్వాత ఆ పాత్రలను వెనక్కు తీసుకువచ్చి శుభ్రంగా కడిగి సర్దిపెట్టింది. అంతవరకు ఆమె ఎవ్వరితో తనను విషసర్పము కాటువేసిన సంగతి ఒక్క మాట కూడా చెప్పలేదు. ఆమెకు భరించరాని బాధ కల్గినా, స్వయంగా డాక్టరుగారితో కూడా ఆమె ఆ విషయం చెప్పలేదు.

ఈ ప్రపంచంలో తన బాధలను మర్చిపోయి ఇతరుల గురించి ఆలోచించేవారు ఎక్కడ ఉంటారు? అలాంటి అరుదయిన ఆత్మస్వరూపులు నిజంగా ఆశీర్వదించబడినవారు. కొద్దిసేపటి తర్వాత జ్ఞానేశ్వరి ఎంతో మామూలుగా నా గదికి వచ్చి బక్కెట్టులో నీరు తీసుకొని వచ్చి కాళ్ళు కడుక్కోసాగింది. అప్పుడే ఆమె నాతో చెప్పింది. తనను ఏదో కరిచిందని, కానీ చీకటి, వర్షం వల్ల తాను అది ఏమిటో సరిగ్గా చూడలేదని చెప్పింది. మేము ఆమె పాదము మీద చల్లని నీటిని ధారాపాతంగా పోశాము. కాని ఆమె తన నోరు చేదుగా, తిమ్మిరిగా మారిపోతోందని చెప్పింది. మేము ఆమెను మంచంపైన పడుకోబెట్టాము. అప్పటికే ఆమె స్పృహకోల్పోయింది. కొద్ది సేపటి వరకూ ఆమె కళ్ళు తెరవలేకపోయింది. మాకు ఎలాంటి సమాధానము ఇవ్వలేని స్థితిలో ఉంది. మేమంతా ఎంతో విషాదంలో, నిస్సహాయస్థితిలో ఉండిపోయాము. మా అందరి హృదయాల్లో కొలువై యున్న అంతర్యామి, ఆ ఈశ్వరుడే మాకప్పుడు శరణము. మా ఆత్మ, మా గమ్యము, ప్రత్యేకించి ఇప్పుడు జ్ఞానేశ్వరికి ఆమె కష్టంలో, బాధలో ఈశ్వరుడే దిక్కు అనిపించింది.

కొద్దిసేపటి తర్వాత ఆమె నెమ్మదిగా కళ్ళు తెరిచి గొణగసాగింది. మేము డా॥ ప్రసాదరావుగారికి కబురు చేద్దాము అనుకున్నాము. కానీ అంత బాధలో కూడా ఆమె మా ప్రయత్నాలను అర్థం చేసుకొని ఆయనని ఆ సమయంలో ఇబ్బంది పెట్టవద్దని సైగ చేసింది. డా॥ప్రసాదరావు గారు ఆ సమయంలో మౌనంగా, ధ్యానంలో ఉంటారు. అయినప్పటికీ ఆమె పరిస్థితి బాగా ఆందోళనకరంగా ఉండడం వలన



మేము డా॥ ప్రసాదరావు గారికి కబురుచేశాము. ఆయన వెంటనే వచ్చి ఎంతో దయతో, చాలా జాగ్రత్తగా, తెలివయిన సూచనలు చేశారు. గొల్లప్రోలులో ఉండే డా॥ మార్కండేయులు గారిని కూడా మా పీస్‌వ్యాన్‌ని పంపించి తీసుకు రావాలని అనుకున్నాము. కొంతమంది మాతో దుర్గాదా రైల్వేస్టేషన్‌కి వెళ్ళి తాంత్రికుడికి ఫోన్ ద్వారా విషయం చెప్పమని చెప్పారు. ఒకవేళ ఎవరినయినా పాము కరిస్తే ఆ తాంత్రికుడికి కబురు చెబితే ఆయన ఏవో మంత్రాలు చదివి తాను ధరించిన వస్త్రాన్ని రెండుగా చీల్చివేస్తాడట. వెంటనే పాము కరచిన రోగి ఎవరయినా, ఎంత దూరంలో ఉన్నా సరే ఆ విషం నుండి పూర్తిగా కోలుకుంటారట. ఇది ఏదో పుస్తకంలో చదివిన కథకాదు. ఇది పూర్తిగా యథార్థమయిన విషయం. ఆయన ఎన్నో సంవత్సరాలుగా ఎంతో మంది ప్రాణాలను ఎంతెంత దూరప్రాంతాల వారిని కూడా పాము కాటునుండి కాపాడారు. అది ఆయనకి భగవంతుడు ప్రసాదించిన వరము. అది నిజంగా అరుదయిన విషయం. ఎంతోమంది బాధితులకు సహాయం అందింది. అంతా భగవంతుని అనుగ్రహము. అలాంటి వ్యక్తి చిరకాలము జీవించి ఎందరికో మేలు చేయుగాక!

కాని మేము మా జ్ఞానేశ్వరిని ఎక్కడికి తీసుకు వెళ్ళలేదు. అలాగే బయటినుండి ఏ వైద్యుడిని పిలువలేదు. అలాగే తాంత్రికుడికి కూడా ఎలాంటి కబురు చేయలేదు. మా డా॥ ప్రసాదరావు గారి పర్యవేక్షణలో మేము ప్రకృతి వైద్యాన్ని ఆశ్రయించాము. ఆయుర్వేద మందులు కూడా డా॥సూర్యనారాయణ గారు ఇచ్చారు. ఇవన్నీ భగవంతుని అనుగ్రహము వలన జ్ఞానేశ్వరికి ఎంతో ఉపశమనం కలిగించాయి. ఆమె తాను పడుతున్న బాధ కంటే, మాకందరికీ ఇబ్బంది కల్గించినందుకే ఎక్కువగా బాధ పడసాగింది. ఆమె మా అందరినీ వెళ్ళి నిద్రపొమ్మని చెప్పింది. తనకి ఇప్పుడు చాలావరకు ఇబ్బంది తగ్గిపోయిందని చెప్పింది. కానీ ఆమెకి ఇంకా బాధ, నొప్పి ఉన్నాయి. పాము కరిచిన చోట పాదము బాగా వాచింది. ఈ విధంగా ఆమె తెల్లవారుఝాము దాకా ఇబ్బంది పడుతూనే ఉంది. భగవంతుని అనుగ్రహము వలన ఆమె జీవితము సురక్షితంగా ఉంది. ఎందుకంటే తూర్పు పడమర దేశాల్లోని ఈశ్వరుడి సంతానము కొరకు ఆమె ఎన్నో సేవలు చేయవల్సిఉంది.

ఈ మధ్యనే నేను విన్నాను. ముగ్గురు జ్యోతిష్కులు ఆమె చేతిని చూచి ఆమె జీవితము సంపూర్ణంగా భగవంతుని సేవకే అంకితమయిపోయిందని చెప్పారు. ఆమె పాశ్చాత్యదేశాలకు కూడా పర్యటనలు చేస్తుందని కూడా చెప్పారు. ఎప్పుడయినా నాకు వచ్చే ఉత్తరాలు, సందేశాలు చదవమని చెప్పినప్పుడు, అలాగే శాంతి పత్రిక

చదివేటప్పుడు ఆమె ప్రసక్తి, పేరు వచ్చినప్పుడు ఆమె దానిని వదిలివేసి మిగతా విషయాలు చదువుతుండేది. ఈ భౌతిక ప్రపంచంలో ద్వందాలతో కూడిన వ్యక్తుల మధ్య అలాంటి నిస్వార్థపరత్వము, శీలసంపద గల వారిని చూడటము చాలా అరుదుగా సంభవిస్తుంటుంది. అలాంటి వారు ఈశ్వరుడు ప్రసాదించిన వరము వంటి వారు. ఒకవేళ నేను జ్ఞానేశ్వరిని నాకు గురువుగా భావించినా లేదా శిష్యురాలు అనుకున్నా లేదా సోదరిగా, బిడ్డగా అనుకున్నా నాకు సంతోషంగా ఉంటుంది. నేను ఎల్లప్పుడూ ఆమె గురించి ఎంతో సంతోషంగా, సంతృప్తిగా, గర్వంగా అనుకుంటాను. కనీసం ఒక్కరయినా ఆమెలాంటి శీలసంపద, నిస్వార్థ ఆత్మ స్వరూపిణి దొరకటము నా అదృష్టము. ఆమె జీవితము, శ్వాస, పనులు ఆమెకోసం కాదు. ఇతరుల సౌభాగ్యం కోసం, ఇతరులకు శాంతిని అందించటము కోసం, ఆశ్రమ పురోభివృద్ధి కోసం కేటాయించుకుంది.

శాంతి ఆశ్రమానికి ఇప్పటికే వందలు, వేలకొద్దీ భక్తులున్నారు, అనుయాయులున్నారు. అన్ని మతాల వారు, అన్ని దేశాల వారు ఉన్నారు. తూర్పు పడమర దేశాల్లో ఎందరో భక్తులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు ఉన్నారు. వారందరికి సంతోషాన్ని కలిగించే విధంగా నేను నా మనస్సులోని కోరికను చాలాకాలము క్రితమే తెలియచేశాను. నేను నా కళ్ళు మూసుకొని, ఈశ్వరుని పిలుపు కోసం ఎదురు చూసినప్పుడు ఆ క్షణంలో నాకు ఒకే ఒక్కరు కనిపిస్తున్నారు. ఈ ఆశ్రమానికి అధిపతిగా ఉండి ఎంతో విజయవంతంగా, సమర్థవంతంగా, ఆధ్యాత్మికంగా ఆశ్రమాన్ని పురోగవృద్ధిబాటలో నడిపించగలిగేది కేవలం ఈ చిన్ని జ్ఞానేశ్వరి మాత్రమే. ఈ ఆశ్రమము ప్రపంచవ్యాప్తంగా ఉన్న భగవంతుని బిడ్డలందరికి వారసత్వ సంపదగా చెందుతుంది. నేను ఇప్పుడే వ్రాస్తున్నాను. ఎప్పుడో నేను చేసినప్పుడు చెప్పటం కాకుండా. ఎందుకంటే ప్రపంచంలోని సుదూర ప్రాంతాల్లోని సోదర సోదరీమణులు, భారతదేశంలోని భక్తులు, ఆశ్రమ శ్రేయోభిలాషులు అందరూ కూడా వారి ఆశీస్సులు, ప్రార్థనలు జ్ఞానేశ్వరికి అందించాలి. అప్పుడే ఆమె తన నిరాడంబరమయిన జీవితాన్ని అదేవిధంగా కొనసాగిస్తూ ఆశ్రమానికి నిరుపమానమయిన బహుమతిగా మారుతుంది. అయినా ఆమె బాల్యంలో తొమ్మిది సంవత్సరాల వయస్సులో ఆశ్రమానికి చేరినప్పటి నుండి కూడా ఎంతో ఉన్నతమయిన, ఆదర్శవంతమయిన సుగుణ సంపదతో జీవిస్తోంది.

మహాకవి షేక్స్‌పియర్ అంటాడు "ఈ ప్రపంచం అంతా ఒక నాటక రంగము. అందులో మనమందరము పాత్రధారులము". ఈ ప్రపంచంలోకి మనమందరము



వచ్చాము. అలాగే ఒకరోజు వెళ్ళిపోతాము. భగవంతుడు మనకు నిర్దేశించిన పాత్రను పోషించి వెళ్ళిపోతాము. ఈ భూమి మీద మనము శాశ్వతంగా ఉండిపోము. మనము ఈ భూమిని ఎంతగా ప్రేమించినప్పటికి దానిని అంటిపెట్టుకొని ఉండిపోము. దాదాపుగా ఏభై సంవత్సరాలు నాకు సాధ్యమయినంత సమర్థవంతంగా నేను పనిచేశాను. ఇదంతా కేవలము ఈశ్వరుని అనుగ్రహమే. ఈ ఆశ్రమాన్ని, శాంతి దేవాలయాన్ని స్థాపించి మీకందరికీ సేవలందించాను. ఈ ఆశ్రమము మీ అందరికీ చెందుతుంది అని చెప్పటానికి నాకు చాలా సంతోషంగా ఉంటుంది. ఇది నాకు ఏ విధంగా చెందుతుందో, మీకు కూడా అదేవిధంగా సమానంగా చెందుతుంది. ఈ ఆశ్రమము మీకు ఆధ్యాత్మికమయిన ఇల్లు వంటిది.

జ్ఞానేశ్వరి ఇక్కడా, అక్కడా, అన్నిచోట్లా ఉంటుంది. నిరంతరము ఎవరో ఒకరికి సహాయం చేస్తూ, సేవ చేస్తూ కనిపిస్తుంటుంది. ఒకచోట చిన్న పిల్లలతో కలిసి కనిపిస్తుంటుంది. వంటశాలలో వంట చేస్తుంటుంది. వైద్యశాలలో రోగులకు సేవలు అందిస్తూ కనిపిస్తుంది. అలాగే ఆశ్రమానికి వచ్చే అతిథులను పలుకరిస్తూ కనిపిస్తుంది. నా బిడ్డ అయిన జ్ఞానేశ్వరి గురించిన ఈ సందేశము 'ఇతరులు' అనే కవితను గురించి చెప్పకపోతే అది సంపూర్ణంగా ఉంటుంది. జీవించినప్పుడు మరణించేటప్పుడూ కూడా ఇతరుల గురించి కలలు కనటము, వారి కోసమే జీవించటము నిజంగా ఎంత అదృష్టము. నేను నా పాఠకులందరికి విజ్ఞప్తి చేస్తున్నాను, నా జ్ఞానేశ్వరి గురించి మీరందరూ మౌనంగా ప్రార్థించండి. ఆమె చేసే గొప్ప ఘన కార్యాల గురించి, ఆమె నిరాడంబర జీవితము అదేవిధంగా కొనసాగుతూ భగవంతుని బిడ్డలందరికీ వరంగా మారుగాక! ఇది మీ అందరిని ప్రేమించే వ్యక్తి ప్రార్థన.

**(సశేషం)**

నీకు దైవమునందు నిజముగా నమ్మికయున్నదా? దైవముయొక్క సర్వజ్ఞత్వము నందును, సర్వవ్యాపకత్వమునందును, సర్వ శక్తిత్వమునందును నీకు పరిపూర్ణ విశ్వాసమున్న యెడల సర్వత్రా ఆ దైవము నేల కాంచజాలవు? మనో వాక్కర్మలచే ఆ దివ్యత్వము నేల ప్రదర్శింపవు?

ఎన్నడును, ఎవరును దైవమును మోసగింపజాలరు. దైవమును మోసగించుట యనగా మనకు మనము మోసగించుకొనినట్లే ఆత్మవంచనయే యగును.

కనురెప్ప కంటినేవిధముగా కాపాడునో, దైవము మనలను ఆ విధముగా సదా రక్షించుచునే యుండును. మన కష్టములందును, దుఃఖములందును మనలను రక్షించునది దైవము గాక అన్యులెవ్వరు?

**–ఓంకార సూక్తులు**

# ఆనంద రామాయణము

(గత సంచిక తరువాయి) **పరిష్కర్త : స్వామి సత్యాత్మానంద**

## 5వ సర్గ

## కార్తికమాస శ్రీవిష్ణువ్రత మహిమ, శ్రీరాముని దినచర్య

ధర్మదత్త ఉవాచ

విలయం యాంతి పాపాని తీర్థదానవ్రతాదిభిః ।
ప్రేతదేహే స్థితాయాస్తే తేషు నైవాధికారితా ॥ 1

త్వత్గ్లానిదర్శనాదస్మాత్ ఖిన్నం చ మమ మానసమ్ ।
నైవ నిర్వృతిమాయాతి త్వామనుద్ధృత్య దుఃఖితామ్ ॥ 2

పాతకం చ తవాత్యుగ్రం యోనిత్రయవిపాకజమ్ ।
నైవాల్పైః క్షీయతే పుణ్యైః ప్రేతత్వం చాతిగర్హితమ్ ॥ 3

తస్మాదాజన్మజనితం యన్మయా కార్తికవ్రతమ్ ।
తత్పుణ్య సార్ధభాగేన సద్గతిత్వమవాప్నుహి ॥ 4

కార్తికవ్రతపుణ్యేన న సామ్యం యాంతి సర్వథా ।
యజ్ఞదానాని తీర్థాని వ్రతాన్యపి తతో ధ్రువమ్ ॥ 5

ఇత్యుక్త్వా ధర్మదత్తోఽసౌ యావత్తామభ్యషేచయత్ ।
తులసీమిశ్రతోయేన శ్రావయన్ ద్వాదశాక్షరమ్ ॥ 6

తావత్ప్రేతత్వనిర్ముక్తా జ్వలదగ్నిశిఖోపమా ।
దివ్యరూపధరా జాతా లావణ్యేన యథోర్వశీ ॥ 7

తతః సా దండవత్ భూమౌ ప్రణనామ యదా ద్విజమ్ ।
ఉవాచ సా తదా వాక్యం హర్షగద్గదభాషిణీ ॥ 8

కలహోవాచ

త్వత్ప్రసాదాద్ద్విజశ్రేష్ఠ విముక్తా నిరయాదహమ్ ।
పాపాబ్ధౌ మజ్జమానాయాః త్వంనౌభూతోఽసి మే ధ్రువమ్ ॥ 9

ముద్గల ఉవాచ

ఇత్థం సా వదతీ విప్రం దదర్శాయాంతమంబరాత్।
విమానం సుందరం యుక్తం విష్ణురూపధరైర్గణైః ॥ 10

అథ సా తద్విమానస్థై విమానే చాధిరోపితా ।
పుణ్యశీలసుశీలాద్యైః అప్సరోగణసేవితా ॥ 11



ధర్మదత్తుడు చెప్పుచున్నాడు, "తీర్థాటనముచేతను, దాన ధర్మములచేతను, వ్రతాచరణముల చేతను, తపస్సుచేతను, పాపములు హరించుచున్నవి. ప్రేత దేహమును అవలంబించిన నీకు వాటిని చేయుటకు అధికారము లేదు. నీకష్టమును జూచి నా మనస్సు నొచ్చుకొనుచున్నది. దుఃఖిస్తున్న నిన్ను విడనాడితే సంతోషము కలుగదు. నీయొక్క మూడుజన్మలలో అనుభవమునకు వచ్చు పాపము చాలా భయంకరమైనది. నింద్యమైన నీ పిశాచత్వము అల్పపుణ్యములతో తొలగదు. కాబట్టి నేను పుట్టినది మొదలుకొని ఆచరించుచు వచ్చిన కార్తీక వ్రతముయొక్క మహా పుణ్యములో అర్ధభాగముచేత నీకు ఉత్తమగతులు కలుగుగాక. యజ్ఞ, దాన, వ్రతాదులేవీ కార్తీక వ్రతపుణ్యమునకు సాటిరాజాలవు," అని చెప్పి, ధర్మదత్తుడు ఆ కలహకు తులసీ జలముచే ద్వాదశాక్షర మంత్రమును వినిపించుచు, అభిషేకము చేసెను. అంత అది ప్రేతత్వమును వదలి అగ్నిజ్వాలాతుల్యమయిన దివ్యదేహమును పొంది, సూర్యకాంతివలె వెలుగొందెను. పిదప అది ధర్మదత్తునకు పాదనమస్కారము చేసి, ఆనందముతో గద్గదస్వరమున, "బ్రాహ్మణోత్తముడా! నీ ప్రసాదము వలన నేను నరకమునుండి ఉద్ధరింపబడితిని. దాటలేని నదిలో మునిగిన నాకు నీవు నౌకవలె అయ్యావు," అని స్తుతించుచుండగా, విష్ణురూపధరులగు గుణములచే వారు విరాజించుచుండు విమానం ఒకటి అచ్చటికి వచ్చెను. సుందరమగు ఆ విమానములో ఉన్నవారు (10) పుణ్యశీల సుశీలాదులు ఈ కలహను దానిమీద ఎక్కించుకొనిరి.

తద్విమానం తదాఽపశ్యద్ధర్మదత్తస్సవిస్మయః।
పపాత దండవద్భూమౌ దృష్ట్వా తౌ పుణ్యరూపిణౌ ॥ 12

పుణ్యశీలసుశీలౌ చ సముత్థాప్యాగతం ద్విజమ్ ।
సమభ్యనందయన్వాణీం ప్రోచతుర్ధర్మసంయుతామ్ ॥ 13

గణావూచతుః

సాధు సాధు ద్విజశ్రేష్ఠ యస్త్వం విష్ణురతః సదా ।
దీనానుకంపీ ధర్మజ్ఞో విష్ణువ్రతపరాయణః ॥ 14

అబాలత్త్వాత్త్వయా హ్యేతద్యత్కృతం కార్తికవ్రతమ్ ।
తవ తస్యార్ధదానేన పుణ్యం ద్వైగుణ్యమాగత్ ॥ 15

త్వత్పుణ్యస్యార్ధభాగేన యదస్యాః పూర్వకర్మజమ్ ।
జన్మాంతరశతోద్వ్రతం పాపం తద్విలయం గతమ్ ॥ 16

స్నానైరేవ గతం పాపం యదస్యాః పూర్వకర్మజమ్ ।
హరిజాగరాణాద్యైశ్చ విమానమిదమాగతమ్ ॥ 17

**వైకుంఠం నీయతే సాధో నానాభోగయుతా త్వియమ్ ।**
**దీపదానభవైః పుణ్యైస్తేజసం రూపమాశ్రితా ॥** 18

**తులసీపూజనాద్యైశ్చ కార్తికవ్రతకైః శుభైః ।**
**విష్ణుసాన్నిధ్యగా జాతౌ త్వయా దత్తైః కృపానిధే ॥** 19

**త్వమప్యస్య భవస్యాంతే భార్యయా సహ యాస్యసి ।**
**వైకుంఠభువనం విష్ణోః సాన్నిధ్యం చ సరూపతామ్ ॥** 20

**తే ధన్యాః కృతపుణ్యాస్తే తేషాం చ సఫలో భవః ।**
**యైర్భక్త్యా ఽఽరాధితో విష్ణుర్ధర్మదత్త త్వయా యథా ॥** 21

**సమ్యగారాధితో విష్ణుః కిం న యచ్ఛతి దేహినామ్ ।**
**ఔత్తానపాదిర్యేనైవ ధ్రువత్వే స్థాపితః పురా ॥** 22

**యన్నామస్మరణాదేవ దేహినో యాంతి సద్గతిమ్ ।**
**గ్రాహగృహీతో నాగేంద్రో యన్నామస్మరణాత్పురా ॥** 23

**విముక్తః సన్నిధిం ప్రాప్తో జాతోఽయం జయసంజ్ఞకః।**
**గ్రాహోఽయం విజయో నామ్నా శ్రీవిష్ణోశ్చింతనాదభూత్ ॥** 24

అప్సరసలచే సేవింపబడుదానిని చూచి, ధర్మదత్తుడు విస్మయమొంది, ఆ పుణ్యాత్ములకు సాష్టాంగముగా నమస్కరించెను. ఆ వెనుక ఆ పుణ్యశీల, సుశీలలు ధర్మదత్తుని లేవనెత్తి, యిట్లు చెప్పుచున్నారు, "మంచిది, మంచిది, మహాబ్రాహ్మణుడా! నారాయణ పరాయణుడును, దీనులయెడ దయగలవాడును, ధర్మజ్ఞుడును, విష్ణు వ్రతరతుడును అయిన నీవు బాల్యమునుండి ఆచరించిన కార్తీక వ్రతపుణ్యమును దానముగా ఇచ్చినందున అది రెండింతలై ఈమెకు పుణ్యబలమునిచ్చి, యీమెయొక్క వెనుకటి నూరు జన్మముల పాపములనుకూడా పోగొట్టి రక్షించినది. ఈమె యనుభవింపదగిన మూడు జన్మల పాపపరిపాకము తొలగిపోయినది. మంత్రజల స్నానముచేతనే తొలగెను. విష్ణుజాగరణాదులచే విమానము వచ్చినది. నానావైభవములతో ఈమెను వైకుంఠమునకు తీసికొనిపోవుచున్నాము. దీపదాన మహిమవలన తేజోరూపము కలిగినది. కార్తీకవ్రతమునందలి తులసీ పూజనాదులచేత వైకుంఠమున విష్ణు సాన్నిధ్యము లభించినది. కరుణాకరుడై కార్తీకమాస పూజా ఫలదానముచేసిన నీవును ఈ జన్మాంతమున భార్యతోడ శ్రీవిష్ణు సాన్నిధ్య సారూప్య ముక్తి పొందగలవు. ధర్మదత్తుడా! నీవలెభక్తితో విష్ణువ్రతమును ఆచరించిన మహాను భావుల జన్మమే సఫలము, వారే ధన్యులు. చక్కగా నారాయణుని సేవించిన వారికి దుర్లభము ఏమిగలదు? ఉత్తానపాదుని కొడుకువిష్ణుధ్యానముచే ధ్రువపదము నొందలేదా? ఆ శ్రీమన్నారాయణ నామపారాయణచే ఏనుగుల భర్తకూడా ముక్తి నొందినట్టి యీ జయుడనువాడును,..



# జన్మదిన సందేశము

**ప్రశ్న:-** ఎవ్వరి జన్మదినము?

**జవాబు:-** మీ జన్మదినమే!

ఉన్నదొక్కటియే. అదియే నీవు. తత్త్వమసి. గాన యిది మీ జన్మదినమే. ప్రతి సంవత్సరము నా జన్మదినము మీ జన్మదినమే అని సదా చెప్పుచునే యుందును.

ఈ మధ్య నేలనో ఆంగ్లేయ పరిపాలన రోజులలో, దేశాభిమానులైన యువకులు "మా కొద్దీ తెల్లదొరతనము" అని పాడెడి పాట జ్ఞప్తికి వచ్చుచు "మాకొద్దీ జన్మదినములు" అని తలవని తలంపుగా నేనుగూడ పాడుచుంటిని. ఈ జన్మదినముల వలన ఫలితమేమి యని నాలో నేను విమర్శించుకొని ప్రియమైన శాంతి పాఠకులు, ఆశ్రమాభిమానులు, ఆశ్రమ భక్తులు, సందర్శకులు, అందరూ శాంతిగా జన్మదినమును జరుపుకొని దైవసన్నిధిని అనుభవించుటకు జన్మదినము పేరునైనను దైవములో లీనమగుటకు కోరుచు ఒక నిర్ణయమునకు వచ్చితిని.

ఇదివరకు జరుగుచున్న జన్మదిన ఫలితములను మీరెరుంగుదురా? జన్మదినము పేరున 21వ తారీకు రాకుండగనే కొందరు భక్తులు వచ్చుచుందురు. వారిని ఆదరించుచు కుశల ప్రశ్నలతో యిష్టాగోష్టిగా కొంతకాలము గడుపవలెను. ఇంక జన్మదినము రోజున వచ్చెడి ప్రజలు వారికి లోటుపాట్లు, ఆహార విహారములయందు, విశ్రాంతియందు శ్రద్ధ తీసుకొనుట, నాకేగాక ఆశ్రమవాసులందరికిని తీరిక లేకుండగా పనిలో మునిగియుందురు. ఒకరి తరువాత నొకరు తరుచు గుంపులుగా వచ్చుచుండ వారికి సందర్శకుల స్వాగతము వినిపించుచు, భజన ధ్యానము చేయించుట జరుగుచుండును. అటులనే తరుచు వేళకు ఆహారమైనను తీసుకొనకుండ, విశ్రాంతి లేకుండ దినము గడిచిపోవుచుండును.

చాల డస్సియుండి యీ భక్తులు వెళ్ళగనే యిక విశ్రాంతి తీసుకొందమనుకొనుచుండ మరియొక గుంపు చాల దూరము నుండి కార్లు మీద వచ్చెదరు. ఖర్మననుభవించుట తప్పుదుగదాయని వారిని ఆదరించుచుండ, వారు మెట్లు దిగుచుండ ముఖ్యమైన భక్తులు మరికొందరు వచ్చెదరు. ఇటులనే ఒక్కొక్కసారి ఆహారము, విశ్రాంతి లేకుండ అర్థరాత్రి అగుచుండును. ఐనను "రెడ్డి వచ్చెను మరల భాగవతము ప్రారంభించుము" అను సామెత జ్ఞప్తికి వచ్చును. అటులనే భక్తులకు స్వాగతము, కుశలప్రశ్నలు, శాంతి ప్రార్థన, ధ్యానము ప్రారంభించబడుచుండుట విచారకరము.

జన్మదిన గండము దైవకృపచే దాటెనని, తృప్తిపడుచుండ, 21వ తారీకున వచ్చుటకు తీరిక లేనివారు 22, 23 తారీకునగూడ వచ్చెదరు. ఆశ్రమ భక్తులు కొందరు వారంరోజులు ముందుగనే వచ్చి, జన్మదినము తరువాత వారంరోజు లుండుటకు కోరుచుందురు. ప్రతి సంవత్సరము విధికృతముగా, తప్పనిసరిగా అనుభవించవలసిన యీ కర్మను తప్పించుకొనుట యెటులను? దీనికి వేరు మార్గము, గత్యంతరము లేదా యని మొన్న వాల్తేరు ఆశ్రమానికి వెళ్ళినప్పుడు ఋషికొండ సముద్రతీరమున కూర్చొని సముద్ర కెరటములు ప్రణవగానమును పాడుచుండ వినుచు కైలాస పర్వతము వైపు చూచుచుండ–

నా వద్దకు రమ్ము, అని కైలాసము పిలుచుచున్నట్లనిపించెను. అదియొక పవిత్రమైన చిరస్మరణీయమైన క్షణము. నేను కైలాసమునకు వచ్చెదనని వాగ్ధానము జేస్తిని. నాకు కైలాసము, దైవము ఒక్కటియే! నా వాగ్ధానము చేసినట్లే! ఉన్నదొక్కటియే, అదియే దైవము. **"అంతా రామ మయంబీజగమంతా రామ మయం'** జన్మదినము పేరున యీ చిన్న కృతిని ఆచరణలో పెట్టినచో మనము తరించెదము.

నేను కైలాసమునకు వెళ్ళుచుంటినని, మా పాఠకులలో కొందరు వ్యయప్రయాస లతో కైలాసమునకు వచ్చుటకు, మనస్సులోనైనను తలంచవలదు. ఏలనన కైలాసములో త్రాగుటకైనను జలము యింకను లేదు. చెన్నారెడ్డిగారు, కైలాసములో నాలుగు రోజులుండి అచ్చట నీటి వసతికి అవసరమైన, ధనమంతయు యేర్పరచి నారు. మన పూజారులు సర్వేగూడ చేయించి, నామరూపముల వెంట పరుగెత్తుచు, కైలాసమును, దైవమును గూడ మరచుట చాల విషాదకరమైన విషయము. వొలికి పోయిన పాలకొరకు విచారించుట లాభము లేకున్నను, యికముందయినను పాలను వొలకనీయకుండ దైవభిక్షను సద్వినియోగము చేసినచో తరించుటకు తోడ్పడును.

ఇంకను జన్మదినము పేరున కొందరు ప్రవృత్తిపరులు వారి గ్రామములు చేరగనే యీ క్రింది అక్షింతలు పంపుచుందురు. మేము గంపెడు ఆశతో ఆశ్రమమును వచ్చితిమి. మాకు పరుండుటకు పక్కలు, బెడ్డింగులు, చాపలు, కప్పుకొనుటకు దుప్పట్లు యివ్వలేదనియు, వేళకు భోజనము పెట్టలేదనియు, కార్లు మీద వచ్చిన వారిని హెచ్చుగా ఆదరించితిరని, అవి లేనివారిని, యితరులను ఆదరించలేదనియు యిట్టి భావనలతో జన్మదిన ఫలితముగా వుత్తరములు వ్రాయుదురు.

ప్రవృత్తిపరులు తమలో యున్నదానినే, యితరులలోను, ఆశ్రమములోను జూచు చుందురు. తిండికొరకై వచ్చినవారు తిండిని గురించియే ఆలోచించెదరు. దైవము



కొరకై వచ్చినవారు యేమూలనో, ఏకాంతముగా కూర్చొని ధ్యానము చేసికొనుచు వృద్ధి అయ్యెదరు. జన్మదినమునకు ముఖ్యమైనది దైవపరితాపన మాత్రమే.

ఈ డెబ్బది నాల్గవ జన్మదినము జ్ఞాపకార్ధముగా ఆశ్రమము స్వయంపోషణ చేసికొనుచు, చిరస్థాయిగా మానవకోటి సేవచేయుచు ఆశ్రమాభిమానులందరి సానుభూతితో అన్ని రీతులుగా ఆదర్శనీయమైన ఆశ్రమముగా దైవకృపచే వృద్ధియగును గాక.

ఇప్పుడు ముఖ్యమైన విషయము మీకు నాకు అందరకూ కావలసినది.

**ప్రశ్న:** ఈ జన్మదినమును యెటుల గడుపవలెను?

**జవాబు:** ఎచ్చట యున్నవారు అచ్చటనే శాంతి ప్రార్ధన 108 మార్లు జన్మదినము జ్ఞాపకార్ధము స్మరించుచు, నివృత్తులై, మీరు వృద్ధియై, ఆశ్రమవృద్ధికి దేశ కళ్యాణము నకు, లోకశాంతికి తోడ్పడవలెను.

108 మార్లు శాంతి ప్రార్ధన స్మరించుటకు తీరిక లేనివారు వారికి యెంత శక్తి, భక్తి తీరికయున్న అన్నిమార్లే శాంతి ప్రార్ధనను తాము చేయుచు, తమ సన్నిధిలో యున్నవారందరిచే స్మరింపచేయుచు, జన్మదినము పేరుననైనను వృద్ధిచెందుచు శాంతిని బడయుటకు ప్రయత్నించవలెను. ధనవంతులైనవారు, వారికి దైవము తోపించిన విరాళములను, ఆశ్రమములోయున్న 70 మంది గురుకుల బాల బాలికలు, అనాధులు యింకను ఆశ్రమసేవ చేయుచు 100 మంది వరకు యున్న పరివారమునకు, నిత్యము వచ్చి వెళ్ళెడి అతిధుల పోషణకు వారి వారి శక్తికొలది విరాళములను, జన్మదినము పేరున ఉడతాభక్తితో పంపుచు, ఆశ్రమమునకున్న పరీక్షలు తగ్గించుటలో తోడ్పడగోరెదను.

మాటలు చెప్పుటగాదు, స్వార్ధరహితమైనసేవ ముఖ్యము. గాన ప్రియమైన శాంతి పాఠకులారా! ఆశ్రమాభిమానులారా! పరోపకారార్ధ మిదం శరీరం. ఈ శరీరము యితరుల సేవకొరకే యివ్వబడెనని, శాస్త్రములు, విజ్ఞులు చెప్పుచుండిరిగాన, ఈ డెబ్బది నాల్గవ జన్మదినము పేరున, స్వార్ధరహితమైన, శాశ్వతమైన సేవను మీరంతా చేయుచు, మీ హృదయములు శాంతిలో, విశ్వప్రేమతో నింపుకొని దీపము ఆరిపోవక ముందే నేడే తరించుటకు ప్రయత్నము చేయుదురుగాక! ఇదియే మిమ్ము ప్రేమించుచు, మీ అంతర్యవృద్ధిని కోరెడి మీ సోదరుని నిరంతర ప్రార్ధన.

**లోకా స్సమస్తా స్సుఖినోభవంతు**

**ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః ఓం తత్ తత్ ఓం**

# ఏకజీవ వాదము - దృష్టి-సృష్టి వాదము

**(డిశంబరు సంచిక తరువాయి)**

**ప్రవచనం - 4**

**ప్రశ్న:** ఏకజీవవాదములో ఉపదేశము ఎలా పనిచేస్తుంది?

గురువు ఉన్నారు. అతని పేరు స్వామి చైత్రానంద, బ్రహ్మచారి మైత్ర చైతన్య, మైత్ర గురువును నీవు కల్పకుడివా లేదా నేను కల్పకుడినా అని ప్రశ్నిస్తున్నాడు. ఒకవేళ నీవు కల్పకుడివి అయితే ఈ కల్పనకు ఉపదేశం ఇవ్వవు. ఎందుకంటే ఈ కల్పన అనేది ఉపదేశానికి అర్హమైనది కాదు. ఒకవేళ నేను సత్యం మీరు కల్పన అయితే, కల్పన ఉపదేశాన్ని ఇవ్వలేదు, ఇవ్వకూడదు. ఎవరు కల్పకులు? ఎవరు కల్పన?

**సమాధానం :** ఇద్దరూ కల్పననే, గురువు కల్పితమే, శిష్యుడు కల్పితమే, బంధము కల్పితమే, మోక్షము కల్పితమే, కల్పకుడు వేరు. వ్యవహారం ఎలా జరుగుతుంది? ఎవరైతే కల్పితమో వాళ్ళకు నేను కల్పితము అని తెలియదు ఇది మొదటి అవిద్య. మొదటి అవిద్య నేను బ్రహ్మ అని నాకు తెలియదు. రెండవ అవిద్య నేను ముఖ్య జీవుడి యొక్క కల్పన మాత్రమే. అనగా నేను సర్ప స్థానీయము. కల్పిత వస్తువుకు ఎంతకాలము అయితే నేను కల్పితము అని తెలియదో అంతవరకు అన్ని వ్యవహారాలు ఆ అవిద్యలోనే జరుగుతాయి. నా యొక్క స్వరూపము ఏమిటని తెలియక ఎవరైనా ఆకలిగా ఉంటే ఆహారం తీసుకుంటారు, ఎవరైనా దాహముగా ఉంటే పానీయములు తీసుకుంటారు, వేరు వేరు సూక్ష్మశరీరాలలో వైచిత్ర్యమనేది ఉంది అవన్నీ కల్పన. వ్యవహార సిద్ధి అనేది సమస్య కాదు. కల్పిత గురువు మరియు కల్పిత శిష్యుల మధ్య శాస్త్ర ఉపదేశము సంభవం.

ముఖ్య జీవుడు యొక్క సంగతి ఏమిటి? ఈ జీవుడికి తత్త్వమసి వాక్యమును ఎవరు ఉపదేశిస్తారు? వాస్తవానికి ఎవరైతే పరిణతి చెంది ఈ ప్రపంచం మిథ్య అని అర్థం చేసుకునే సామర్థ్యం ఉందో, బ్రహ్మ దేవుడి వలె నాలుగు భగలు కలిగి ఉన్నారో (ఈశ్వరుడికి ఆరు భగలున్నాయి) ఆ హిరణ్యగర్భ పరమాత్మకు చాలా సమీపంలో ఉన్నాడు. అవిద్య కారణంగా హిరణ్యగర్భలాగ వ్యక్తమవుతున్న ఆ పరమాత్మ (అవిద్యాగ్రస్థ హరణ్యగర్భ) కు తత్త్వమసి ఉపదేశ గ్రహణం పూర్వజన్మలో జరిగింది, కానీ ప్రతిబంధ కారణంగా అతను ఈ జన్మను స్వీకరించాడు. ఎందుకంటే ఈ జ్ఞానం అందరికీ రాదు. ఈ ప్రపంచం అంతా కూడా నా యొక్క కల్పన అనే జ్ఞానం పొందాలంటే నేను కొంత సాధన చేయవలసి ఉంటుంది. సాధన కర్మ మరియు ఉపాసన అలాగే అత్యధిక జ్ఞానం ఉంది కానీ ఏదో ప్రతిబంధం ఉంది, ఆ



ప్రతిబంధం అనేది తాదాత్మ్యం రూపంలో ఉంది, ఆ తాదాత్మ్యలను వదిలిపెట్టాలి. ఎవరైతే శాస్త్రమును ఇదివరకే విని ఉన్నారో ఆ సామర్థ్యముతో, మహావాక్య విచారము ద్వారా ఆ ఏకజీవుడు తాదాత్మ్యాన్ని వదిలిపెట్టి నేను బ్రహ్మ అని అర్థం చేసుకోగలడు. ఒకవేళ ఈజన్మలో అతనికి ఉపదేశం అవసరం అయితే పరమాత్మ సమకూరుస్తాడు. అంతేకానీ మరొక జీవుడు అవసరం లేదు. ఆ జీవుడి యొక్క పారమార్థిక స్వరూపం ముక్తుడు. అవిద్య కారణంగా వ్యావహారిక స్వరూపం బద్ధుడు. **జీవస్య అవిద్యకత్వేన బద్ధత్వం స్వరూపతః ముక్తత్వం.** జీవుడు ఒక్కడే మిగతా జీవులందరూ కల్పితం, అన్ని స్థూల సూక్ష్మశరీరాలు అవిద్య కారణంగా పనిచేస్తున్నాయి ఈ రకమైన ఆలోచనలు మహా వైరాగ్యాన్ని కలిగిస్తాయి. దృష్టి-సృష్టి నిరంతర ఆలోచన ఈ జగత్ అంతా స్వప్నం వలే కల్పనా మాత్రం. ఉన్నది జీవుడు ఒక్కడే. ఆ జీవుడే బ్రహ్మ. అవిద్యా కారణంగా నేను జీవుడిని అని ఆలోచిస్తున్నాడు. ఉపదేశము చాలా సూక్ష్మమైనది, కానీ చిత్తశుద్ధిని ఇస్తుంది. ఇదంతా కల్పన అని నేను నిరంతరం ఆలోచించినపుడు సంపద పొందాలని పేరు ప్రతిష్టలు కావాలని కోరుకోను. ఇదంతా కల్పితం. నాకు వైరాగ్యం కావాలి, ఈ పద్ధతి ద్వారా, ఈ ఉపదేశాన్ని ఆలోచిస్తూ నేను వైరాగ్యం పొందాను. ఒకవేళ ఎవరో ఒక జీవుడు గురువు నుండి జ్ఞానం పొందాడు, గురువు కల్పితము, శిష్యుడు కల్పితము, ఉపదేశము కల్పితము. వేదాంతములో కల్పిత జ్ఞానము మోక్షాన్ని ఇస్తుంది అని అంగీకరించారు.

**పూ.ప.** : కల్పిత జ్ఞానము వాస్తవిక మోక్షమును ఎలా ఇస్తుంది? కల్పిత జ్ఞానం సమస్యలను ఎలా పరిష్కరిస్తుంది?

**సిద్ధాంతి** : పరిష్కరించవచ్చు. సమస్య దానంతట అదిగా కల్పితము అని చెప్పవచ్చు. కాబట్టి జ్ఞానం కూడా కల్పితము మరియు పరిష్కారము కూడా కల్పితము. లేదా కల్పిత జ్ఞానముకు వాస్తవ పరిష్కారమును ఇవ్వగలిగే సామర్థ్యము ఉంది. అద్దములో నన్ను నేను చూసుకున్నప్పుడు నేను నా యొక్క ప్రతిబింబాన్ని చూస్తున్నాను. అద్దములో నేను లేను కానీ నేను నా ముఖంలో ఏదైనా చేయాలనుకుంటే చేయవచ్చు. నా నేత్రముల ద్వారా నా ముఖాన్ని నేను చూడలేను కానీ అద్దములో ఉన్న ప్రతిబింబము ద్వారా చూడగలను. కల్పిత వస్తువుకు అకల్పిత వస్తువును మార్గ దర్శనము చేయుటకు సామర్థ్యము కలదు. కల్పిత జ్ఞానమునకు నా యొక్క అకల్పిత గుర్తింపును వ్యక్తపరచుటకు సామర్థ్యం ఉంది, నేను ఆ కల్పిత వస్తువును కాదు.

**పూ.ప.** : తత్త్వమసి మహావాక్యములో తత్పదము, త్వంపదము ఉన్నాయి.

**తత్పదము** : చైతన్యము స్థూల, సూక్ష్మ, కారణ శరీరములన్నింటి తో తాదాత్మ్యము చెంది ఉండడాన్ని తత్పదము అంటున్నారు.

**త్వంపదము** : చైతన్యము జీవుడితో తాదాత్మ్యము చెంది ఉండడాన్ని త్వంపదము అంటున్నారు.

తత్త్వమసి మహావాక్యను అర్థం చేసుకోవడం కోసం తత్పదము త్వంపదముల విచారము అవసరము. ఏకజీవ వాదములో ఒకే జీవుడు త్వంపద వాచ్యార్థము మరియు లక్ష్యార్థ చైతన్యము. అదే జీవుడు సృష్టి రూపములో ఉన్నాడు. ఎందుకంటే సృష్టి అనేది అతడి కల్పన. అలాంటప్పుడు తత్పద మరియు త్వంపదములను ఎలా విభజిస్తారు? తత్ అంటే ఏమిటి, త్వం అంటే ఏమిటి అనే పదార్థ శోధనం చేయవలసి ఉంటుంది, అప్పుడు మహావాక్య శ్రవణం ఆ తరువాత తత్ మరియు త్వం మధ్య ఐక్యం. ఏకజీవవాదములో తత్ మరియు త్వం ఈ రెండు పదార్థాలు లేవు అటువంటప్పుడు ఇది ఎలా వర్తిస్తుంది? మాండూక్య ఉపనిషద్‌లో కూడా ఇదే ప్రక్రియ ఉంది. తత్పదార్థము మరియు త్వంపదార్థము వేరు చేసి వివేకము చేసినట్లయితే త్వంపదార్థము జాగ్రత్ అవస్థ అభిమాని విశ్వ. త్వంపదార్థ స్వప్న అవస్థ అభిమాని తైజసుడు. త్వంపదార్థము యొక్క లక్ష్యము అయిన చైతన్యము సుషుప్తి అవస్థ అభిమాని ప్రాజ్ఞుడు. అదేవిధంగా తత్పదములో విరాట్, హిరణ్యగర్భ, ఈశ్వరుడు.

కానీ మాండూక్యలో ఈ విభజన లేదు. విశ్వ వేరు వైశ్వానరుడు వేరు అనే ఆలోచన లేదు ఇద్దరు ఒకటే. అదే విధంగా హిరణ్యగర్భ మరియు తైజసుడు వేరు కాదు, ఒక్కటే. ప్రాజ్ఞుడే ఈశ్వరుడు. **ఏషః ప్రాజ్ఞః ఏవ సర్వేశ్వరః "ఏష సర్వేశ్వరః ఏష సర్వజ్ఞః ఏషోన్తర్యామి ఏష యోనిః సర్వస్య ప్రభవాప్యయౌ హి భూతానాం"** ఉపనిషత్తు ప్రాజ్ఞుడే ఈశ్వరుడని చెబుతుంది. ఏం సూచిస్తున్నారంటే తత్పదం వేరు త్వంపదము వేరు కాదు. త్వంపదార్థ శోధనం, తత్పదార్థ శోధనం చేసి వాటిని ఐక్యం చేయడం ఇలా వేరు వేరు విచారణ చేయనవసరంలేదు. ఏకజీవ వాదప్రక్రియలో మొదటనే త్వంను తత్‌లో కలిపేయడం జరుగుతుంది. తత్ మరియు త్వం ఒకటే. సమిష్టి కంటే వేరుగా వ్యష్టి అనేది లేదు. సమిష్టి వ్యష్టి వేరు వేరు అనే ఆలోచనలేదు. కేవలం సమిష్టి మాత్రమే ఉంది. ఊహించుకోండి ఈ బ్రహ్మాండమంతా ఒక సమిష్టి దానియొక్క వాచ్యార్థము ఉపాధి, అనగా చైతన్యము మరియు ఉపాధి. జాగ్రత్ స్వప్న సుషుప్తి అవస్థ. స్థూల సూక్ష్మ కారణ ప్రపంచం ఇవన్నీ కూడా చైతన్యము యొక్క ఉపాధి. ఉపాధి కంటే వేరుగా ఉన్నది లక్ష్యార్థము. మొదట తత్పదము మరియు త్వంపదము కలపాలి. ఆ తరువాత విచారణ చేయడానికి ఉన్నది ఒకటే అది ఏకజీవవాదము. ఏ శృతి ఈ ఏకజీవవాదమును సమర్థిస్తుంది? మూడవ మంత్రము బహిఃప్రజ్ఞ వైశ్వానరుడని చెబుతుంది, నాలుగవ మంత్రం అంతః ప్రజ్ఞ తైజసుడని చెబుతుంది. ఐదవ మంత్రం ప్రాజ్ఞ, ఆరవ మంత్రం ఆ



ప్రాజ్ఞనే ఈశ్వరుడు అని చెబుతుంది. సమిష్టి నుండి వ్యష్టి మరియు వాటి ఐక్యము ఈ మూడు మంత్రాలలో చూడవచ్చు. అనగా అవి వేరు కాదు, వాటిని వేరుగా విచారించనవసరం లేదు, అవి ఒకటే. **"అనాది మాయయా సుప్తః యదా జీవః ప్రబుధ్యతే"** ఇక్కడ జీవః ఏకవచనము, ఇది శృతి ఉద్ధరణ ఇక్కడ తీసుకున్నారు. కానీ ఇతర ఉద్ధరణలు చాలా ఉన్నాయి, **"యథా ప్రదీప్తాద్పావకాస్ఫులింగాః సహస్రశః ప్రభవంతే"** చాలా మిణుగురులు అగ్ని నుండి బయటకు వస్తున్నాయి అంటే ఈ ప్రక్రియలన్నీ కూడా ఎవరైతే ఆలోచనలో పరిణతి చెందలేతో వారికోసం, వారికి బహుజీవవాద ప్రక్రియ అవసరము. పరిణతి చెందడము అంటే ఇక్కడ ఏం జరిగింది, అక్కడ ఏం జరిగింది... నాకు సబంధము లేదు. నేను పూర్తిగా ఉపరమణం చెంది ఉండాలి. ఒకవేళ నాకు బహిర్ముఖత ఎక్కువగా ఉన్నట్లయితే, కర్మతో తాదాత్మ్యం ఉంటే నేను ఈ బహుజీవవాదమును అనుసరించాలి. నేను వాస్తవానికి యోగారూఢను, గీతలో భగవంతుడు చెబుతాడు. **"యదాహినేన్ద్రియార్థేషు న కర్మస్వనుషజ్జతే సర్వ సంకల్ప సంన్యాసీ యోగారూఢస్తదోచ్యతే"** ఎక్కువగా ఉన్నట్లయితే ఈ బహుజీవవాద ప్రక్రిల వర్తిస్తుంది. **యదా హి న ఇంద్రియార్థేషు విషయేషు** ఇంద్రియాల యొక్క ఏ విషయాలకైనా ఇతను ప్రభావితం చెందదు, వాటియందు తాదాత్మ్యం లేదు, న కర్మసు కర్మయందు తాదాత్మ్యం లేదు, నేను ఇది చేయాలి, అది చేయాలి అనేది లేదు. జరగాల్సింది ఉంటే జరుగుతుంది. నీవు ఒకవేళ నిమిత్తగా ఉండవలసి వస్తే నిన్ను నిమిత్తగానే ఉంచుతారు. అప్పుడు నీవు నిమిత్త మాత్రం. ఒకవేళ రెండుచేతులలో నుండి బాణాలను వదిలిపెట్టినప్పటికి నీవు కేవలం నిమిత్తం, అర్జునుడు నిమిత్తం అయితే అందరు నిమిత్తమే. ఈ సృష్టిలో ఎవరూ గొప్పవారు కాదు. చైతన్యం మాత్రమే అవిద్య మాయ ద్వారా ఇదంతా చేస్తుంది. ఒకవేళ నేను ఈ ఏకజీవ వాదమునకు సిద్ధము అయితే ఇదే ఉపదేశము. లేదంటే బహుజీవ వాదమును కొనసాగించాలి. నిదానంగా ఎదగాలి, స్వప్న దృష్టాంతము పదే పదే ఆలోచిస్తున్నప్పుడు, అనగా జాగ్రత్ స్వప్నంతో సమానము అని ఆలోచిస్తున్నప్పుడు, ఈ సృష్టిని నేను అనుభవిస్తున్నాను, ఈ సృష్టి స్వప్నము. ఇదంతా ఎవరి స్వప్నము? ఎవరి కల్పన? ఒకవేళ నేనే ఆ ముఖ్య జీవుడిని అయితే మిగతా జీవులందరూ కల్పన మాత్రమే. ముఖ్య జీవుడికి ఉపదేశము అనేది తత్పదము. త్వంపదము అనే భేదము మొదట్లో లేదు. ఒకే ఒక పరిచ్ఛిన్న చైతన్యము ఉంది. అనేకము కాదు. నేను చేయవలసిందల్లా అపరిచ్ఛిన్నత్వమును తొలగించాలి. ఏకజీవవాదము యొక్క ఆలోచనా క్రమము దృష్టి సృష్టి వాదమును అనుసరించి ఈ విధముగా ఉంటుంది.

# సర్వ వేదాంత సిద్ధాంత సారసంగ్రహం

**॥ఓం॥**

**శ్రీమత్పూజ్యభగవత్పాదశఙ్కరాచార్యవిచరితః**

**శఙ్కరప్రసాదినీ టీకా సహితః (పూజ్యశ్రీ బోధాత్మానంద సరస్వతి స్వామి)**

## సాధనచతుష్టయమ్

### నిత్యానిత్యవస్తువివేకః

**అధునా షడ్భిః శ్లోకైర్వివేకో వర్ణ్యతే :**

బ్రహ్మైవ నిత్యమన్యత్తు హ్యనిత్యమితి వేదనమ్ ।
సోఽయం నిత్యానిత్యవస్తువివేక ఇతి కథ్యతే ॥17॥

బ్రహ్మ నిత్యము బ్రహ్మకంటే అన్యమైనది అనిత్యము అని తెలుసుకోవడమే నిత్యానిత్య వస్తు వివేకం.

**పరం నిర్విశేషం బ్రహ్మైవ నిత్యమబాధ్యం దేశ-కాల-వస్తు-పరిచ్ఛేద శూన్యమ్ "నిత్యం విభుం సర్వగతం సుసూక్ష్మమ్" ఇత్యాదిశ్రుతేః। అన్యత్తు సర్వమనిత్యమ్। యత్కిఞ్చిత్క్రియాకారకఫలరూపం తత్సర్వమనిత్యమ్। వేదనమిత్యాకారా బుద్ధిర్జ్ఞానమ్। యద్యపి సాధకేన నిత్యబ్రహ్మణో గురుముఖాచ్ఛ్రవణం న కృతం తథాపి తస్యాపాతతో జ్ఞానేన నిత్యం వస్త్వస్తీతి స నిశ్చయవాన్వివేక సామర్థ్యసమ్పన్నో భవతి। సర్వమన్య దనిత్యమితి జ్ఞానం నిత్యానిత్యవస్తువివేకః కథ్యతే।**

పరమమైనది మరియు ఎటువంటి విశేషణాలు లేనిది అనగా స్థూలము కానిది, సూక్ష్మము కానిది, పొడవుగా లేనిది, పొట్టిగా లేనిది అయిన బ్రహ్మ మాత్రమే నిత్యం, ఈ బ్రహ్మను దేని ద్వారాను ప్రతిషేధించడానికి వీలులేదు అనగా ప్రత్యక్షాది ప్రమాణముల ద్వారా బ్రహ్మను తెలుసుకోలేము, దీనియందు దేశకాలవస్తు పరిమితములు లేవు అనగా దేశ, కాల, వస్తువులన్నింటికి అతీతమైనది. ''నిత్యం, వివిధరకాలుగా వ్యక్తమవడం, అంతటా వ్యాపించి ఉండటం, అత్యంత సూక్ష్మం" (ము.ఉ : 1.1.16).

బ్రహ్మకంటే వేరైనది సర్వం అనిత్యం. ఏదైతే క్రియను, కారకమును (కర్త, కర్మ, కరణ, ప్రయోజనం పొందేవాడు, పోలిక, అధికరణం), కర్మ ఫలితమును కలిగి ఉంటుందో అదంతా అనిత్యం. ఈ రకంగా నిత్య అనిత్య వస్తువులను వేరుచేయగలిగే జ్ఞానమే వివేకము. నిత్య బ్రహ్మను గురించి గురుముఖతః శ్రవణం చేయకపోయినప్ప టికిని నిత్య వస్తువు ఒకటుంది అనే నిశ్చయమైన జ్ఞానమును కలిగిన సాధకులు వివేకసామర్థ్య సంపన్నులు అవుతారు. అన్యమైనవన్నీ మిథ్యా అనే జ్ఞానం నిత్యానిత్య వస్తువివేకం అని తెలుపబడింది.



**కిఞ్చ** - మరియు

**మృదాదికారణం నిత్యం త్రిషు లోకేషు దర్శనాత్।**
**ఘటాద్యనిత్యం తత్కార్యం యతస్తన్నాశ ఈక్ష్యతే ॥18॥**

మట్టి మొదలైన కారణాలు నిత్యం అని మూడు లోకాలలోనూ దర్శితమవుతుంది. దానియొక్క కార్యం కుండ మొదలైనవి అనిత్యం, ఎందుకనగా అది నశించిపోవడం చూస్తున్నాము అందువలన అది అనిత్యం.

**త్రిషు లోకేషు యత్కార్యం తత్కృతకం తదనిత్యమ్। మృదాదికారణం నిత్యం యత్కారణం తత్కార్యాపేక్షయా నిత్యమితి దర్శనాత్। తత్కార్యం ఘటాద్యనిత్యంయతో యస్మాత్తన్నాశ ఈక్ష్యతే దృశ్యతే తస్మాత్తదనిత్యమ్। న కేవలమనిత్యం కిన్తు యస్య ప్రాగభావప్రధ్వంసాభావౌ తస్యాత్యన్తాభావోఽపి దృశ్యతే గౌడపాదాచార్య ఊచిరే "ఆదావన్తే చ యన్నాస్తి వర్తమానేఽపి తత్తథా" ఇతి ।**

మూడు లోకాలలోనూ మట్టి మొదలైన కారణాలు నిత్యం అని తెలుస్తుంది. ఏదైతే కార్యమో అది ఉత్పత్తి అయినది. కావున అది అనిత్యం. కార్యము దృష్ట్యా కారణము నిత్యం. ఘటాది మొదలైన కార్యము అనిత్యం, ఎందుకనగా వాటి యొక్క నాశనమును దర్శిస్తున్నారు కనుక అది అనిత్యం. కేవలం అనిత్యమే కాదు, ఉత్పత్తికి ముందు అది లేదు, నాశనమునకు తరువాత అది లేదు, మరియు అత్యంత అభావమును కూడా కలిగి ఉండడం దర్శితం. గౌడపాదాచార్యులవారు "ప్రారంభంలో ఏదైతే లేదో చివరిలో ఏదైతే లేదో అది మధ్యలో కూడా లేదు" (మా.కా: 2.6) అని వివరించారు.

**తథాహి** - అదే విధంగా

**తథైవైతజ్జగత్సర్వమనిత్యం బ్రహ్మకార్యతః।**
**తత్కారణం పరం బ్రహ్మ భవేన్నిత్యం మృదాదివత్ ॥9॥**

అర్థం స్పష్టం

**తథైవైతత్సర్వంజగదనిత్యం బ్రహ్మకార్యతః బ్రహ్మణః కార్యత్వాద్ఘటవత్। తత్కారణం తస్య జగతః కారణం పరం బ్రహ్మ నిత్యంభవేత్కారణత్వాన్మృదాదివత్।**

అదే విధంగా ఘటమువలె బ్రహ్మ యొక్క కార్యము అయిన ఈ జగత్ అంతా అనిత్యము. మట్టివలె జగత్‌కు కారణము అయినందున పరంబ్రహ్మ నిత్యం.

(పక్షము-జగత్, సాధ్యము-అనిత్యం, హేతువు-కార్యమయినందువలన, దృష్టాంతము-ఘటమువలె, వ్యాప్తిః-ఎక్కడైతే కార్యత్వం ఉంటుందో అక్కడ అనిత్యత్వం ఉంటుంది)

**ఆచార్యప్రవరైరేవోక్తమ్–“కార్యే హి కారణం పశ్యేత్పశ్చాత్కార్యం విసర్జయేత్। కారణత్వం తతో నశ్యేదవశిష్టం భవేన్మునిః” । ఏతేనాధ్యారోపాపవాదన్యాయేన కార్య కారణవిలక్షణమశేష విశేషశూన్యం చతుర్థం తురీయం ప్రకాశితమ్।**

ఆచార్యుల ద్వారా వివరించబడింది–1.కార్యములో కారణమును చూడాలి, 2.ఆ తరువాత కార్యమును వదిలిపెట్టాలి, అనగా కార్యము కారణము కంటే వేరుగా లేదు కాబట్టి కార్యము మిథ్యా అని అర్థం చేసుకోవాలి. 3. కార్యము లేనప్పుడు కారణత్వం ఎలా ఉంటుంది? కారణత్వం కూడా నశించిపోతుంది. మిగిలినది ముని అవుతాడు (అపరోక్షానుభూతి:139). దీనినే అధ్యారోప అపవాదము అంటారు. ఈ అధ్యారోప అపవాద న్యాయము ద్వారా కార్యకారణములు అతీతమైన, విశేషణములు లేనిది అయిన చతుర్థం, తురీయము వివరించబడుతుంది.

**ఏతస్మిన్నాశఙ్క్యతే। మృదాదీనాం కారణత్వాత్కథం నిత్యత్వమ్। వేదాన్తేషు బ్రహ్మైవ నిత్యం ప్రతిపాదితమ్। ఉచ్యతే సర్గమితి–**

వేదాంతములో బ్రహ్మ మాత్రమే నిత్యం అని ప్రతిపాదించారు. అప్పుడు మట్టి మొదలైన కారణము నిత్యం ఎలా అవుతుంది? ఇందులో ఎటువంటి సందేహము ఉండకూడదు అని చెబుతున్నారు–సర్గం..

సర్గం వక్ష్యస్య తస్మాద్వా ఏతస్మాదిత్యపి శ్రుతిః।
సకాశాద్బ్రహ్మణస్తస్మాదనిత్యత్వే న సంశయః ॥**20**॥

ఈ సృష్టి అంతా బ్రహ్మ నుండే వచ్చిందని శృతి కూడా తెలియజేస్తుంది. “దాని నుండి నిశ్చయముగా, దీనినుండి” (తై.ఉ: 2.1). అందువలన బ్రహ్మ నుండి వచ్చిన ఈ సృష్టి అనిత్యం అనడంలో సంశయం లేదు.

**“యథా సోమ్యైకేన మృత్పిణ్డేన సర్వం మృణ్మయం విజ్ఞాతం స్యాద్వాచారమ్భణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యమ్” ఇతి శ్రుత్యా దృష్టాన్తేన మృత్తికాయాః సత్యత్వముక్తం న తత్పరమార్థతః। “తస్మాద్వాఏతస్మాదాత్మనః ఆకాశస్సమ్భూతః” ఇత్యాదినా శ్రుతిరస్య జగతః సర్గం బ్రహ్మణో మాయావిశిష్టబ్రహ్మణః సకాశాద్వక్తి। నిరవయవస్య నిర్వికల్పస్య బ్రహ్మణః కారణత్వమనుపపన్నమ్। తత్ర మాయా పరిణామ్యుపాదానం భవతి, బ్రహ్మ తు వివర్తోపాదానం నిమిత్తఞ్చ। తస్మాజ్జగతో నిత్యత్వే న సంశయః, విచికిత్సా న కర్తవ్యా ।**

“ఓ కుమారా! ఒక మట్టి ముద్ద ద్వారా అన్ని మట్టి వస్తువులు తెలిసిపోతాయి, వాక్కే వికారాలకు ఆధారమై ఉంది, మరియు ఆ వికారాలు కేవలం పేరు మాత్రమే, వాస్తవానికి మట్టి మాత్రమే సత్యం” అనే ఉదాహరణ ద్వారా వ్యావహారికంగా మట్టి సత్యం కానీ, పారమార్థికంగా కాదు అని శృతి తెలియజేస్తుంది. **(సశేషం)**





**ఓం నమో నారాయణాయ**

**జననం : 13-10-1931 - దివ్యసన్నిధి : 26-12-2025**

**పరమ ప్రేమమూర్తి, పరమ ప్రేమ స్వరూపిణీ, శాంతికి నిలయము అయిన పూజ్యశ్రీ జ్ఞానేశ్వరీ మాతాజీ శ్రీ శాంతి ఆశ్రమ అధ్యక్షులుగా అందరికీ తెలిసిన విషయమే. పరమయోగి ఓంకార్ స్వామి వారికి ప్రియశిష్యులు మరియు స్వామివారి ప్రేమకు పాత్రురాలై దేశ విదేశాలలోనే కాక మారుమూల కుగ్రామం వరకు అందరి హృదయాలలో శాంతి సామరస్యాలను నెలకొల్పినటువంటి మహా యోగిని ది. 26-12-2025 రోజున ఉదయం గం॥ 6.40 ని॥లకు గురు సన్నిధికి చేరుకున్నారు. వారి దివ్య భౌతిక కాయమును ది. 27-12-2025 శనివారం రోజున ఉదయం గం॥ 10.30 ని॥లకు ప్రాంగణములో మహాసమాధి చేయబడును.**

**శాంతి ఆశ్రమ నిర్వాహకులు**

(శాంతి ప్రార్థన)

# విన్నపము

## ఓం నమో భగవతే ఓంకారాయ

భగవత్ స్వరూపులైన పూజ్యశ్రీ ఓంకార స్వామి వారి గురించి, వారు వ్రాసిన "శాంతి ప్రార్థన" గురించి తెలుసుకోవడం అంటే అనంతమైన సముద్రపు లోతును కొలవటానికి సాహసించినట్లే! శాంతి ప్రార్థనకు వ్యాఖ్యను అందజేయాలనుకోవడం సాహసమే. అయినా ఎందరో తపోధనులు, జ్ఞానులు, మహాత్ములు, అందరూ, ఆధ్యాత్మిక మార్గములో ఇప్పుడే ఓనమాలు నేర్చుకుంటున్న నా ప్రయత్నాన్ని మనసారా ఆమోదించగలరని నా విన్నపము. పూజ్యశ్రీ స్వామి శివానందజీ, పూజ్యశ్రీ స్వామి చిదానందజీ, పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ మరియు పూజ్యశ్రీ శారదా ప్రియానందజీ, పూజ్యశ్రీ చిన్మయానందజీ మరియు ఎందరో మహాత్ముల ఉపదేశాలను ఈ ప్రార్థన ఆధారంగా తీసుకొని వ్యాఖ్యానించడం జరిగింది. మహాత్ములందరికి నా నమస్సులు ఒక్కటియే సమర్పించగలను. ఈ వ్యాఖ్యలో ఏమైనా తప్పులుంటే అవి నా బుద్ధికి చెందినవిగా గ్రహించి నన్ను క్షమించి ఒప్పులేవయినా ఉంటే పూజ్య గురుదేవుల వారివని భావించి మన్నించవలసినదిగా నా విన్నపము.

అనంత సూర్యునకు కర్పూర నీరాజనము ఇచ్చినట్లే, ఈ చిన్ని వ్యాఖ్య గురుదేవుల పాదపద్మములకు సమర్పితము.

# ఉపోద్ఘాతము

ప్రతీ వ్యక్తి శాంతికావాలని ఆశిస్తాడు. అనేక కోటానుకోట్లు సంపాదించిన ప్రతివ్యక్తికూడా శాంతికోసమని పరితపిస్తాడు. శాంతికోసమని బాహ్యంగా వెతకడానికి ప్రయత్నిస్తాడు. శాంతి కావాలని హోటళ్ళకు, క్లబ్బులకు, సినిమాలకు వెళతారు. శాంతి బాహ్యముగా ఎక్కడను లేదు, మనలోనే ఉన్నది. ప్రతి వ్యక్తి శాంత స్వరూపుడే. కాని అజ్ఞాన ఆవరణచే తన సహజశాంత స్వరూపాన్ని మరచి శాంతి పొందాలని బయట శోధిస్తున్నాడు. బయట శాంతి కావాలని శోధిస్తే శాంతి ఎట్లా లభిస్తుంది?

శాంతి మనలోనే ఉందా! అది ఎట్లా? శాంతి మనలోనే ఉంది అనే విషయాన్ని కొన్ని ఉదాహరణల ద్వారా తెలుసుకుందాము.

**"రాజగృహ భోజనాదిషు తథైవ దృష్టత్వాత్"** (నా.భ.సూ. అ2.)

**ఉదాహరణ 1:** అవంతి నగరమును ఒకానొక రాజు పరిపాలించుచుండెను. ఆ రాజునకు ఒకపుత్రుడు కలిగెను. విధివశాత్తు ఆ రాజపుత్రుని దొంగలు



అపహరించిరి. వాడు ఏదో విధముగా ముని ఆశ్రమమునకు చేరుకొనెను. ఆ మునీంద్రుడు రాజకుమారుని పెంచుచుండెను. ఆ బాలుడు తాను ముని యను భావముచే ప్రవర్తించుచుండెను.

ఒక దినమున అవంతి నగర మంత్రి ముని ఆశ్రమమునకు వచ్చెను. ఆ మంత్రి మునిపుత్రుడను చూసి, నీవు ముని పుత్రుడవు కావు, అవంతి నగర రాజపుత్రుడవని తెలిపెను. తాను ఎప్పుడయితే రాజపుత్రుడనే భావన కలిగినదో, అతనిలో శౌర్యము, వీరత్వము, పరాక్రమము కలిగి తన రాజ్యమునకేగి అవంతి నగర సింహాసనమును అధిష్ఠించెను.

**ఉదాహరణ 2:** ఒక గృహస్థు స్వగృహమును విడిచి దేశాంతరమునకేగి కొన్ని సంవత్సరముల పిదప స్వగృహము చేరుకొనెను. వాడు దేశాంతరము వెళ్ళిన తరువాత వాని స్వగృహము ఉన్నది ఉన్నట్లే ఉండెను. దేశాంతరము వెళ్ళుట కారణముగా తాను అనుభవించిన సుఖము మాత్రము దూరమయ్యెను. వాడు ఇల్లు చేరిన వెంటనే పూర్వ అనుభవము కలిగెను.

**ఉదాహరణ 3:** ఆకలి బాధ కలిగినప్పుడు ఆహార మొసగిన ఆకలి బాధ తొలగు చున్నది. కాని నూతన తృప్తి కలుగుటలేదు. తృప్తి సహజము. ఆకలి బాధ నూతన మైనది. క్షుద్బాధ తొలగినప్పుడు సహజమైన తృప్తి యన్నది యున్నట్లే ఉన్నది.

పై మూడు ఉదాహరణలు మనకు ఏమి తెలుపుచున్నవి?

**"న తేన రాజ పరితోషః క్షుదాశాంతిర్వా"** (నా.భ.సూ. అ2)

1. నీవు ముని పుత్రుడవు కాదనుట చేత నూతనముగా రాజ పదవి పొందలేదు.

2. దేశాంతరము వెళ్ళిన గృహస్థు కొన్ని సంవత్సరముల పిదప స్వగృహము చేరిన తరువాత నూతనముగా స్వగృహ సుఖ అనుభవమును పొందలేదు.

3. క్షుద్బాధ తొలగినప్పుడు నూతనముగా తృప్తి పొందలేదు. తృప్తి సహజము.

| | | |
|---|---|---|
| **రాజపుత్రుడు** | – | **పరమ శాంత స్వరూపుడు** |
| **మునిపుత్రుడు** | – | **జీవుడు** |
| **దొంగలు** | – | **అజ్ఞానము** |
| **మంత్రి** | – | **గురువు** |

తాను రాజపుత్రుడు, కాని దొంగలు అపహరించుటచేత తన సహజ స్వరూపాన్ని మరచి ముని ఆశ్రమమునందు తాను మునిపుత్రుడనే భావనచే ప్రవర్తించుచుండెను. ఎప్పుడైతే మంత్రి వచ్చి నీవు మునిపుత్రుడవు కావు, రాజుపుత్రుడవు యని తన

సహజ స్వరూప స్థితి బోధించినపుడు తాను ముని స్వభావమును వీడి తన సహజ స్వరూపమైన రాజపదవి (శాంతి సామ్రాజ్య సింహాసనము) అధిష్ఠించెను. ముని పుత్రుడు ఎక్కడనో లేడు, జీవుడే మునిపుత్రుడు. అజ్ఞానమనే దొంగలు జ్ఞానమును అపహరించుటచేత తాను ముని యను భావనచే మెలగుచుండెను. ఎప్పుడయితే మంత్రి (గురువు) వచ్చి స్వరూప జ్ఞానమును బోధించెనో, ఆత్మ సామ్రాజ్య పదవిని అధిష్ఠించెను.

ఎలా అయితే మంత్రి వచ్చి రాజపుత్ర స్వరూపాన్ని గుర్తుచేసి మునియను భావన దూరం చేసాడో. అదే విధంగా పూజ్య ఓంకార స్వామీజీవారు అశాంతితో సతమత మవుతున్న మానవాళి **"శాంతిప్రార్థన"** ద్వారా, **"పరమశాంతిని"** పొందుటకు గాను, వారు పరమమైన శాంతిని అనుభవించి, సూర్యుని తాపముచే వేడెక్కిన కర్కశమైన భూమిని చంద్రుడు చల్లబరచినట్లు, స్వామీజీ వారు చంద్రునివలె అవ్యాజ కరుణార్ధ హృదయముతో భావితరములవారు పరమశాంతిని పొందుటకు శాంతిప్రార్థనను అందించిరి.

శాంతి ప్రార్థన సామాన్యమైనది కాదు. దాని అర్థము గ్రహించని వారు 'నేత్రములకు నేత్రము" ఏమిటి యని భావిస్తారు. నారికేళపాకము, ద్రాక్షపాకము అని రెండు ఉన్నవి. నారికేళపాకము అంటే టెంకాయ నీరు. టెంకాయనీరు సేవించాలి అంటే దానిపై పీచుతీసి ఎంతో శ్రమిస్తే కాని టెంకాయ నీరు లభ్యము కాదు. ద్రాక్షపాకము అంటే ద్రాక్షరసము. ద్రాక్షరసము సేవించాలి. అంటే ఒక్క నిమిష పళ్ళను ముద్దచేసి ద్రాక్షరసమును సేవించవచ్చును.

వేదములు, ఉపనిషత్తులు గ్రహించాలి అంటే టెంకాయ నీరు సేవించడానికి శ్రమించినట్లు చాలా శ్రమపడాలి. సూక్ష్మబుద్ధి కలవారు మాత్రమే వేదములను, ఉపనిషత్తుల భావాలను గ్రహించగలరు. అందుకని పూజ్య స్వామీజీవారు ఈ శ్రమను గ్రహించి వేదముల, ఉపనిషత్తుల సారాంశాన్ని వెన్నలాగ గ్రహించి ద్రాక్షపాకము అందించినట్లు మనకు అందించిరి. ఈ శాంతి ప్రార్థన "కేన", "చాంధోగ్య" ఉపనిషత్తుల ద్రాక్షామృతాన్ని అందిస్తుంది. అందరము ద్రాక్షామృతాన్ని ఆస్వాదించి పరమమైన శాంతిని పొందెదము గాక!

**జై గురుదేవ అర్పణమస్తు.**

**ఇట్లు**
**పాదదాసి**
**వినమ్రానంద సరస్వతి**



## విరాళములు

| | | |
|---|---|---|
| 1. | డా॥శ్రీమతి ఆర్.వసుమతి నాయుడుగారు (శాంతిఆశ్రమం) | 3,000/- |
| 2. | శ్రీ ఆత్మకూరి వంశీకృష్ణ గారు (విజయవాడ) అన్నదానం, వీరి పెండ్లిరోజు సందర్భముగా | 5,500/- |
| 3. | శ్రీ నాదెళ్ళ సత్యశ్రీనివాస్ గారు (కాకినాడ) వీరి తల్లితండ్రులు శ్రీ నాదెళ్ళ వెంకట రమణమూర్తి, శ్రీమతి అన్నపూర్ణల జ్ఞాపకార్థం విద్యాఖర్చుల నిమిత్తం | 20,000/- |
| 4. | శ్రీ మాగాపు రామకృష్ణగారు, శ్రీమతి కుమారిగారు (కాకినాడ) | 5,000/- |
| 5. | డా॥ రాంకుమార్‌గారు (కాకినాడ) గోశాల నిమిత్తం | 5,000/- |
| 6. | డా॥ జి.వి. కృష్ణారావు గారు (గుంటూరు)గరుకు స్తంభం నిమిత్తం | 5,000/- |
| 7. | శ్రీ సానిపిని భీమేశ్వరరావు గారు (శాంతిఆశ్రమం) భగవాన్ సత్యసాయిబాబావారి జన్మదినము సందర్భముగా అన్నదానం | 15,000/- |
| 8. | శ్రీ ఎల్.వి. శ్రీ కిరణ్‌గారు (విశాఖపట్నం) శివాలయమునకు రెయిలింగ్ నిమిత్తం | 50,000/- |
| 9. | శ్రీ చిన్ని రాంకుమార్‌గారు (విశాఖపట్నం) వీరి తండ్రి చిన్ని రంజిత్‌గారి జన్మదినం సందర్భముగా అన్నదానం | 15,000/- |
| 10. | శ్రీమతి కె.రత్నజగారు (విశాఖపట్నం) గరుకుస్థంభం నిమిత్తం | 10,116/- |
| 11. | శ్రీమతి ఎమ్.నాగమణి గారు మరియు శ్రీమతి కుసుమ నాయుడు గారు (విశాఖపట్నం) | 5,000/- |

## శాశ్వత అన్నదానం

| | | |
|---|---|---|
| 1. | శ్రీ కందక మల్లేశ్వరరావు & అనంతలక్ష్మిగార్లు (రాజమండ్రి) వీరి మావయ్యగారు శ్రీ నూలు, సత్యనారాయణగారి జ్ఞాపకార్థం | 10,000/- |
| 2. | శ్రీమతి పి.పద్మారమణి గారు (హైదరాబాదు) వీరి భర్త గారు శ్రీ పి.వెంకటేశ్వరరావు గారి జ్ఞాపకార్థం | 10,000/- |
| 3. | శ్రీమతి గుంటి వెంకట కోటేశ్వరమ్మగారు (కొత్తూరు తాడేపల్లి) వీరి తల్లి శ్రీమతి పినప్రోలు నాగేశ్వరమ్మగారి జ్ఞాపకార్థం | 10,000/- |
| 4. | శ్రీమతి డి. అనిత గారు (హైదరాబాదు) వీరి తండ్రి రోళ్ళ రాధాకృష్ణమూర్తి గారి జ్ఞాపకార్థం | 10,000/- |
| 5. | డా॥ ఎమ్.వి. ఉషారాణి గారు (హైదరాబాదు) వీరి తల్లి శ్రీమతి మల్లమణి గారి జ్ఞాపకార్థం | 10,000/- |
| 6. | శ్రీ బైపల్లి దుర్యోధన గారు (విశాఖపట్నం) వీరి కోడలు శ్రీమతి బైపల్లి ప్రశాంతి జన్మదినము సందర్భముగా | 10,000/- |
| 7. | శ్రీమతి & శ్రీ జె.ఎ.శాస్త్రి గారు, శ్రీమతి రాజేశ్వరి గారు సికింద్రాబాదు) గరుకు స్తంభం నిమిత్తం | 10,000/- |

8. శ్రీమతి & శ్రీ జె.ప్రభాకరరావు, శ్రీమతి శైలజగారు (సికింద్రాబాదు
గరుకు స్తంభం నిమిత్తం 10,000/-
9. శ్రీమతి కె. ఇందిరగారు (విశాఖపట్నం) గరుకు స్తంభం నిమిత్తం 10,000/
10. శ్రీమతి ఎస్.వినుత గారు (విశాఖపట్నం) గరుకు స్తంభం నిమిత్తం 10,000/-
11. శ్రీమతి జి.బి.ఎస్.లక్ష్మిగారు (విశాఖపట్నం) వీరి కుమార్తె
డా॥ వై.హేమా & వై.వి.హరికృష్ణగారు పెండ్లిరోజు సందర్భముగా 15,000/-
12. శ్రీమతి జి.బి.ఎస్.లక్ష్మిగారు (విశాఖపట్నం) గరుకుస్తంభం నిమిత్తం 10,000/-
13. శ్రీమతి ఎమ్.హిమబిందుగారు (శాంతిఆశ్రమం) గరుకుస్తంభంనిమిత్తం 10,000/-
14. శ్రీ కంటిపూడి బలరామకృష్ణగారు (వేట్లపాలెం) గోగ్రాసం నిమిత్తం 10,000/-
15. శ్రీమతి ఎమ్.హిమబిందు గారు (శాంతి ఆశ్రమం) 40,000/-

**పూజ్యశ్రీ ఓంకారస్వామివారి అనుగ్రహంతో, పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీవారి ఆధ్వర్యంలో ఈ క్రింది కార్యక్రమములు జరుపబడును.**

## కార్యక్రమములు-మాతృఆశ్రమం

**ది.14-01-2026 బుధవారము :** భోగిపండుగ సందర్భముగా పూజలు జరిపించబడును.

**ది.15-01-2026 గురువారము :** సంక్రాంతి పండుగ సందర్భముగా పూజలు జరిపించబడును.

**ది.16-01-2026 శుక్రవారము :** కనుమపండుగ సందర్భముగా పూజలు జరిపించబడును.

**ది.23-01-2026 బుధవారము :** వసంతపంచమి సందర్భముగా పూజలు జరిపించబడును.

**ది.25-01-2026 బుధవారము :** రథసప్తమి సందర్భముగా శ్రీ సూర్య అష్టోత్తర శతనామార్చన జరుపబడును.

**ది.29-01-2026 గురువారము :** ఉ॥ 7.30 ని॥లకు "భీష్మ ఏకాదశి" సందర్భంగా శ్రీకృష్ణ అష్టోత్తర శతనామార్చన, భగవద్గీత పారాయణం

| | |
|---|---|
| **1. మాతృ ఆశ్రమం**<br>శ్రీ శాంతి ఆశ్రమము<br>తోటపల్లి కొండలు,పిన్ : 533 446<br>వయా శంఖవరం, కాకినాడ జిల్లా<br>సెల్ :7382009962<br>రిసెప్షెన్ : 7815890094<br>e-mail : srisanthiashram@gmail.com | **4. కోటగిరి శాఖ**<br>పీస్ సెంటర్, డార్మోనా రోడ్,<br>కోటగిరి-643217, నీలగిరిజిల్లా,<br>తమిళనాడు,<br>ఫోన్ : 04266- 271945<br>e-mail: vsvmsktg@yahoo.com<br>vsvmsktg@gmail.com |
| **2. విశాఖ : శాంతి ఆశ్రమము**<br>లాసన్స్‌బే, పెదవాల్తేరు-530 017<br>విశాఖపట్నం<br>ఫోన్ : 0891 - 2538689<br>e-mail : srisanthiashramvsp@gmail.com | **5. కాకినాడ శాఖ**<br>శాంతి ఆశ్రమము,అశోక్ నగర్<br>కాకినాడ - 533 004<br>కాకినాడ జిల్లా |
| **3. విశ్వశాంతి క్షేత్రం**<br>కైలాసగిరి<br>విశాఖపట్నం | **6. పిఠాపురం శాఖ**<br>స్టువర్టు పేట,పిఠాపురం-533 450<br>కాకినాడ జిల్లా |

Website : www.srisantiashram.org



# దాతలకు విజ్ఞప్తి

దివ్యాత్మ స్వరూపులకు సూచన. శ్రీ శాంతి ఆశ్రమమునకు విరాళము ధన రూపంలో / చెక్కు / ఎస్.బి.ఐ. కత్తిపూడి, అకౌంట్ నెం. 11003309435 కు IFSC Code : SBIN0014774 ఆన్‌లైన్ ద్వారా పంపగలరు. మీ విరాళములకు ఇన్‌కమ్‌ట్యాక్స్ 80జి రాయితీ కలదు. మీరు ఏ విధంగా విరాళము పంపినను వ్రాత పూర్వకంగా లేదా ఇమెయిల్ ద్వారా మొబైల్ నంబరు 7382009962 మరియు రిసెప్షన్ నెంబరు 7815890094కు మీ పేరు, చిరునామా మీ మొబైల్ నంబరు తెలుపగలరు.

# శాంతి పత్రిక చందాదారులకు విజ్ఞప్తి

శాంతి పత్రిక ప్రతినెలా 5వ తేదీన పోస్టు చేయబడును.

సం॥ర చందా రూ.100/-, జీవిత చందా రూ.1000/- (12 సంవత్సరముల వరకు మాత్రమే), ఎమ్.ఓ/స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కత్తిపూడి అకౌంట్ నెం.11003309435, ఆన్‌లైన్ ద్వారా ఈ క్రింది చిరునామాకు పంపగలరు.

ఎమ్.ఓ.ఫారమ్‌లో దిగువ ఫర్ కమ్యూనికేషన్ భాగములో మీ పూర్తి చిరునామా వ్రాయాలి. తదుపరి క్రొత్త చందా లేక పాత చందా అనునది క్లుప్తముగా వ్రాయాలి. పాత చందా అయితే చందాదారు సంఖ్య వ్రాయాలి.

చందాకాలం ముగింపుకు నెలముందే రెన్యువల్ చేసుకొనవలెను. మీ అడ్రస్ మార్పు జరిగితే, ఉత్తరము ద్వారా తెలుపుతూ చందా నెంబరు వ్రాయాలి. చందా వివరములు తెలుపని యెడల సొమ్ము విరాళముగా జమచేయబడును.

కార్యదర్శి, శ్రీ శాంతి ఆశ్రమం (పోస్ట్)
వయా శంఖవరం - 533 446, తూ.గో.జిల్లా

# విన్నపము

విదేశములలో వుండు ఆశ్రమ భక్తులు విరాళములు ఈ క్రింది ఎఫ్.సి.ఆర్.ఎ (Foreign Contributions Regulation Act) బ్యాంక్ అకౌంట్‌కు తమ నివాస ప్రాంతములోని తమ బ్యాంక్ అకౌంట్ నుండి ఆ దేశ కరెన్సీలో పంపగలరు. పంపిన పిదప వివరములు srisanthiashram@gmail.com అనే మెయిల్ ఐడికి మరియు mattavvs07@gmail.com తప్పకుండా పంపవలెను.

బ్యాంకు పేరు : State Bank of India, 11 Sansad Marg, New Delhi -110001

A/c Name : The Mission of peace - FCRA A/c No : 40127798428

Swift Code : SBININBB104

This Periodical is Registered with Registar of Newspapers, New Delhi Vide R.No. 3447/57,
Dt. 18-12-20 Permitted to Post Under Concessional Postage Vide AP/KD-24/2024-2026

## SRI SANTI ASHRAM ENGLISH PUBLICATIONS

1. Auto Biography of swami Omkar (2 Volumes) ................ Rs. 150/-
2. Life and Teachings of Swami Omkar ................ Rs. 10/-
3. Soham ................ Rs. 10/-
4. Cosmic Fast ................ Rs. 20/-
5. Meditation ................ Rs. 10/-
6. Om Japa ................ Rs. 10/-
7. Control of Mind ................ Rs. 30/-
8. Cosmic Flashes ................ Rs. 10/-
9. In the Hours of Silence ................ Rs. 10/-
10. The Soul of Omkar ................ Rs. 10/-
11. How I learned English ................ Rs. 10/-
12. Reincarnation of my Little Sister ................ Rs. 10/-
13. God Realization Now and Here ................ Rs. 10/-
14. Mystic Prayers and Poems ................ Rs. 20/-
15. The Divine Voice of Omkar ................ Rs. 40/-
16. Auto Biography of Omkar (Revised Edition) ................ Rs. 100/-
17. Petals of Peace ................ Rs. 20/-
18. The Story of my life and Work ................ Rs. 10/-
19. Priceless legacy of Swami Omkar ................ Rs. 10/-
20. The Four Initiations ................ Rs. 10/-
21. Musings ................ Rs. 20/-
22. Peace Prayer ................ Rs. 20/-

THE MISSION OF PEACE
శ్రీ శాంతి ఆశ్రమము
పోస్టు: శాంతి ఆశ్రమము
(వయా) శంఖవరం - 533 446
కాకినాడ జిల్లా, (ఆం.ప్ర.)
ఫోన్ : 7382009962
email: srisanthiashram@gmail.com
www: www.srisantiashram.org

Book Post

_______________________

_______________________

_______________________

Published by MVV Satyanarayana on behalf of The Mission of Peace - Sri Santi Ashram and printed at Mohan Graphics, Kakinada - 533 001. Ph:0884-2361419 and Published at Thotapalli Hills-533 446, Ph: 73820 09962 Editor : Swamini Vinamrananda